Reg. No. 1118.

Founder: K. NAGESWARA RAO

ఆంధ్రపత్రిక

విడిపత్రిక అణా.

Editor: S. SAMBHU PRASAD.

315443

Vol. 29. * ANDHRA PATRIKA, MADRAS, MONDAY, 7-9-42 * No. 149

గాంధి, అజదు మున్నగునాయకుల విడుదల చేయవలెను

ప్రతిష్టంభన నివారణ

సర్వపక్షైక్య ప్రయత్నములు

ఢిల్లీలో ఆలోచనలు

ఢిల్లీ, సెప్టెంబరు 6:—

దేశములో ప్రస్తుతము యేర్పడిన విషమ స్థితినిగురించి భారతి అసెంబ్లీలో సభ్యులు సాకల్యముగా చర్చించుట కవకాశముకలిగే లాగు కనబడుతుండుటవల్లను హిందూమహాసభ ప్రతినిధులు ప్రచారముచేస్తూవుండుటవల్లను 'దేశంలోఅన్నిపార్టీలవారున్ను కలసి వెంటనే యిండియాకు సంపూర్ణస్వాతంత్ర్యము నియ్యకపోతే బ్రిటనుదొరతనమువారిని కోరుటకు నిర్ధారణమైనపద్ధతులను నిర్ణయించుటనుగురించి, యిప్పుడు ఢిల్లీలోవున్న భారత అసెంబ్లీసభ్యులు అధికోత్సాహముతో చర్చలను జరుపుతున్నారు. వీరిలో పండిత కుంజ్రూగారు మొదలైనవారు రాజప్రతినిధి కార్యసంఘములో సభ్యులుగావున్న భారతీయులతో దీనినిగురించి సంభాషించారు "అసెంబ్లీలోనుకాన్సిలులోను జరిగే చర్చలు ఫలప్రదమైనవిగా వుండవలెను. కేవలము దొరతనమువారిని విమర్శించుటతోనే యివి ఆగిపోగూడదు" అని వీరు కోరుతున్నారు.

సప్రూపార్టీ ప్రధాన కార్యదర్శి సర్ జగదీశప్రసాదుగారు కూడా యీ చర్చలలో పాలుగొన్నారు. ముఖ్యసిద్ధాంతముల విషయములో అన్నిపార్టీలకు అధికమైన అంగీకారము కుదిరినయెడల దీనిని గురించి ఆలోచించుటకు సాధ్యమైనంత త్వరలో సప్రూపార్టీవారి సభను జరుపవలెననికూడ సర్ జగదీశగారు కోరుతున్నారు. తనకు యీ సంభాషణలవల్ల కలిగిన నిశ్చితాభిప్రాయమును సర్ జగదీశగారు సర్ సప్రూగారికి తెలియజేస్తారని తెలిసింది.

శ్యామప్రసాద ముఖర్జీగారు మొదలైన హిందూమహాసభ నాయకులు అమృతసరు నుంచిన్నీ, బెంగాలుప్రధానమంత్రి ఫజులులు హకుగారు కలకత్తానుంచిన్నీ రేపు ఢిల్లీ వస్తారు. మిశ్రమ ప్రభుత్వము యేర్పడవలెననే ఫజులులు హకుగారు కూడా కోరుతున్నారు. బెంగాలులో ప్రోగ్రెసివు కొయిలేషను పార్టీలో 150 మంది సభ్యులున్నారు. వీరిలో 80 మంది ముస్లిములు. వీరందరున్ను కూడా మిశ్రమ ప్రభుత్వపద్ధతిని ఆమోదించారని హకుగారు ప్రకటిస్తున్నారు. పంజాబు నాయకుల అభిప్రాయములను ముఖర్జీగారు రేపిక్కడి నాయకులకు తెలియజేస్తారు.

ముఖర్జీగారు రాజప్రతినిధితో మాట్లాడును

శ్యామప్రసాదుగారు రేపటిదిన రాజప్రతినిధితో మాట్లాడుతారనిఢిల్లీలో మహాసభ కార్యాలయమువారు చెప్పారు. (అ. ప్రె.)

భారత సంస్థానముల ముస్లింలీగు కార్యసంఘంవారి తీర్మానము

నాగపూరు, సెప్టెంబరు 6:—

నవాబు యూసుఫజంగు బహదరుగారి అధ్యక్షతక్రింద నేడిక్కడ భారత సంస్థానముల కార్యసంఘసభ జరిగింది. ఆసభలో యీరీతిగా వకతీర్మానము చేయబడెను.

"ఇప్పుడు దేశమందంతటా జరుగుతున్న అల్లరులవల్ల ప్రజల నైతిక ఆర్థిక అభివృద్ధికిన్ని హిందూ ముస్లిం మైత్రికిన్ని కూడా భంగం కలుగుతుంది. ఇండియాలో విదేశీయుల పరిపాలన వుండగూడదు. ఇండియాకు సంపూర్ణ స్వాతంత్ర్యము లభించవలెను. ఇండియాలో హిందూజాతి ముస్లింజాతి అనే రెండు జాతులున్నాయి. ఈరెండు జాతులకున్ను సుస్థిరముగా గౌరవప్రదమైన సమాధానము కుదిరితేగాని యిండియాకు స్వాతంత్ర్యము లభించదు. అన్ని పార్టీలవారున్ను పాకిస్తానుకు అంగీకరిస్తేగాని సమాధానము కుదరదు. కాంగ్రెసువారు దీనికంగీకరించుటలేదు. బొంబాయిలో ముస్లింలీగు వారిటీ వలచేసిన తీర్మానమువల్ల సమాధానము కుదురుటకు గొప్ప అవకాశమేర్పడ్డది. తక్కిన పార్టీలవారిప్పుడు కూడా పాకిస్తానుకు అంగీకరించనియెడల దేశమునకు మహానర్థకము కలుగుతుంది. బ్రిటను దొరతనమువారికి సంస్థానాధిపతులపైని అత్యధికమైన విశ్వాసమున్నది. గనక తక్కిన అన్ని పార్టీలవారున్ను పాకిస్తానుకు అంగీకరించేలాగు చేయుటకు సంస్థానాధిపతులు కూడా గట్టి ప్రయత్నము చేయవలెను. అన్ని పార్టీలవారున్ను పాకిస్థానకు యిప్పుడంగీకరిస్తే దేశంలో వెంటనే తాత్కాలికముగా జాతీయప్రభుత్వం యేర్పడుతుంది. పాకిస్తానును తుద్దేశము మగిసినతరువాతే యేర్పరచవలెనేగాని యిప్పుడే యేర్పరచనక్కరలేదు. సంస్థానములలో ముస్లిము లెవరున్ను యీ అల్లరులలో చేరగూడదు. యితర పార్టీలవారి కుతంత్రములకు లొంగగూడదు. (అ. ప్రె.)

భారత సమస్యా పరిష్కారమునకు ముందు జరగవలసినపని

అఖిలభారత కార్మిక వాంఛితము

బ్రిటను, అమెరికా కార్మికసంఘములకు విజ్ఞప్తి

నాగపూరు, సెప్టెంబరు 6:—

నిన్న నిక్కడ వి. ఆర్. కాలప్పగారి అధ్యక్షతను జరిగిన అ. భా. కార్మిక సంఘ సమాలోచకసభలో ప్రస్తుతరాజకీయపరిస్థితిని గురించి ఒక దీర్ఘ తీర్మానం చేస్తూ, ప్రభుత్వంవారు రాజకీయసంస్థ లన్నింటితోను రాయబారాలు జరిపి, త్వరలోనే రాష్ట్రాలలోను, కేంద్రమునందును జాతీయ ప్రభుత్వాన్ని స్థాపించి, స్వతంత్రభారతదేశం దేశరక్షణకు తగ్గప్రయత్నాలన్నింటిని పటుతరంగా పూర్తిగా చేసుకోటాని కవకాశాలు కలుగజేయాలని కోరిరి.

గాంధిమహాత్ముని, మౌలానా అజదుగారిని యితర కాంగ్రెసునాయకులను కారాగారాలనుంచి విడుదలచేస్తే తప్ప భారత సమస్యా పరిష్కారం సాధ్యంకాదు. గాబట్టి వెంటనే వారిని విడుదలచేసి, భారతీయులకు వెంటనే అధికారం సంక్రమింపచేయాలనే వాంఛితాన్ని ప్రభుత్వం అంగీకరించేటట్లు చేయవలసిందిగా గ్రేటు బ్రిటనులోని కార్మికసంఘాలకు కార్మికోద్యమ నాయకులకు యీ తీర్మానంలో విజ్ఞప్తిజేసిరి. ఇదేవిధంగా అమెరికాలోని కార్మికసంఘానికి కార్మికోద్యమ నాయకులకు విజ్ఞప్తిచేస్తూ గ్రేటుబ్రిటను భారతజాతీయవాంఛితాన్ని అంగీకరించి అధికారం వారికి సంక్రమింపజేసేట్లు తమప్రభుత్వంపై వత్తిడి కలుగజేయవలెననిన్ని ఆ తీర్మానంలో విజ్ఞప్తి చేసిరి.

ఇంకను మరికొన్ని తీర్మానాలు చేస్తూ నాగపూరు బట్టల మిల్లులలోని పనివారలు కోరుతున్నట్లు తగినంతగా బోనసు నిప్పించవలెనని వారి కోరికను బలపరచిరి. రానున్న కార్మికమహాసభలో అ. భా. కార్మికసంఘ ప్రతినిధులుగా అధ్యక్షుడు వి. వి. గిరిగారిని కార్యదర్శి యెన్. యెం. జోషీగారిని యెన్నుకొనిరి. (అ. ప్రె.)

సమష్టి జుర్మానాలు

జిన్నాగారి ప్రకటన

బొంబాయి, సెప్టెంబరు 6:—

సమష్టిజుర్మానాలనుగురించి భారత ముస్లింలీగు అగ్రనాయకుడు జిన్నాగారిలాగు వక ప్రకటనచేశారు.

"దేశమందంతటను ముస్లిము లందరున్ను సాత్వికనిరోధసంబంధమైన అల్లరులలో లేశమైనా సంబంధమును కలుగజేసుకోకుండా వుంటున్నందుకు నేను ముస్లిములనందరిని అత్యధికముగా ప్రశంసిస్తున్నాను. ఇప్పుడు చాలా రాష్ట్రీయులలో ప్రభుత్వములవారు ప్రజలందరివల్లను వుమ్మడిగా జుల్మానాలను వసూలుచేస్తున్నారని నాకు తెలిసింది. ఈ జుర్మానాలను ముస్లిము లెవరున్ను చెల్లించనక్కరలేదని యిండియాదొరతనమువారున్ను రాష్ట్రీయ దొరతనమువారున్ను వెంటనే ప్రకటనలను చేయవలెనని నేను రాజప్రతినిధిని గవర్నరులను కోరుతున్నాను. వీరీలాగుచేస్తే ముస్లిముల కిప్పుడు కలిగిన భయసంశయములు తొలగిపోతాయి. ఈ అల్లరులతో ముస్లిముల కేవిధమైన సంబంధమున్ను లేదు. గనక వారివల్ల జుర్మానాలను వసూలు చేయడం న్యాయంకాదు.

చీనాసేనల విజయము

టంగ్‌యాంగ్ పరిసరములలోచీనాసేన

కిన్వా, లాంచీలపై చీనావారి తీవ్రదాడులు

చంకింగు, సెప్టెంబరు 6:—

ఆదివారమునాడు చైనా సైనికాధికారులీ క్రింది ప్రకటన గావించిరి:—

చకియంగునందలి చైనాసేనలు టంగ్‌యాంగ్ పరిసరములకు చేరిరి. కిన్వా, లాంచీ పట్టణములపై చీనావారు యిదివరకుకంటె యెక్కువ తీవ్రముగా దాడులు సాగించుచున్నారు.

నైరృతి పాంషీరాష్ట్రములో ఒక చైనా దళము హోయ్‌చిన్ నగరములోనికి చొచ్చుకొనిపోయి, శత్రువులకు విస్తారముగా జనక్షయము కలుగజేసెను.

టంగ్‌యాంగు కిన్వాకు ఈశాన్యమున 80 మైళ్లదూరములోనున్నది. చకియాంగ్-కియాంగ్స్ రైల్వేమీద నిదియున్నది. ఇది చాల ముఖ్యమైనపట్టణము. కిన్వాప్రాంతమునందలి జపాను సేనలకును, యితర జపాను సేనలకును సంబంధము లేకుండచేయుట చీనా పోటుయొక్క ఉద్దేశ్యమని స్పష్టమగుచున్నది.

కిన్వాను రక్షించుటకు జపాను ప్రయత్నము

బొంబాయి, సెప్టెంబరు 5:—

పశ్చిమ చెకియంగునందలి లాంచీ మరల శత్రు హస్తగతమయ్యెననియు, ఈ నగరముపై చీనావారు తిరిగి తీవ్రదాడి గావించుచున్నారనియు శుక్రవారము రాత్రి చీనా అధికారులు ప్రకటించిరి. ఇది యిట్లుండ, చకియంగ్-కియాంగ్స్ రైల్వేపైనున్న ముఖ్య నగరమగు కిన్వాను రక్షించుటకై జపానువారు క్రొత్తసేనలను, విమానములను, శతఘ్నికలను పంపుచున్నారు.

జపానువారి ఉపసంహరణ

క్వాంటాంగ్ రంగములో జపానువారు కాంటన్-హాంకో రైల్వే దక్షిణముగాను, తూర్పుగానుగూడ యింకను వెనుకకు తగ్గిరి. జపానుపోటుకు పూర్వము, గత మే మాసములో ఉభయ సైన్యములు యే యే ప్రదేశములలో నుండెనో యిప్పుడా ప్రదేశములలో నున్నవి.

జపాను విమానదాడులు

ఉత్తర పుకియనునందలి ఒక పట్టణముమీదను, పశ్చిమపుకియను నందలి టాంగ్‌చింగ్‌మీదను జపానువారు విమానదాడి గావించిరి. 20 మంది చనిపోయిరి. కొన్ని యిండ్లు నాశమయ్యెను.

నెండెల్ విల్కీకి స్వాగతము

నెండెల్ విల్కీ గారికి స్వాగత మొసంగుటకు చీనాలో యేర్పాటులు జరుగుచున్నవి. విల్కీ గౌరవార్థమై నిందు, మహాసభ జరుగును. (అ. ప్రె.)

ఉత్తరఫ్రాన్సుపై అమెరికావారి విమానదాడి

లండన్, సెప్టెంబరు 7:—

అమెరికా రంగములో పోరుచున్న అమెరికా సైనికాధికారులును, బ్రిటిషు విమానశాఖవారును కలిసి ఈ క్రింది ప్రకటన గావించుచున్నారు:—

అమెరికావారి ఫ్లయింగ్ ఫార్ట్రెస్ విమానములును, బోస్టనువిమానములును ఫైటర్లసహాయముతో వెళ్లి నిన్న ఉత్తరఫ్రాంసునందలి లక్ష్యములపై దాడిగావించెను. బోస్టనులు ఆబెవిల్లీవద్దనున్న ఒక శత్రు విమానాశ్రయముపై బాంబులు వేసెను. ఒకగంట తరువాత మాడు ఫ్లయింగ్ ఫార్ట్రెసువిమానదళములు ఆల్బర్టువద్దనున్న మాలెట్‌నందలి విమానచట్టములను నిర్మించు (ఎయిర్ ఫ్రేము ఫాక్టరీ) ఫాక్టరీపైబాంబులు వేసెను. మరియొకదళము సెంటుఓమేరువద్దనున్న విమానాశ్రయముపై బాంబులు వేసెను. బ్రిటిషు, అమెరికను అధినివేశ బాంబరుదళములు ఫైటర్లసహాయముతో వెళ్లి శత్రువుల దృష్టి మరబ్చుటకై దాడులు గావించెను. 2 ఫ్లయింగ్ ఫార్ట్రెసు విమానములు 3 ఫైటర్లు కనబడుటలేదు.

న్యూగినీ యుద్ధము

శత్రు విమానాశ్రయముపై తీవ్రదాడి

సైరుతి పెసిఫిక్ రంగమునుండి, సెప్టెం 6:

ఆదివారమునాడు మిత్రమండలి అధికారులీ క్రింది ప్రకటన గావించుచున్నారు:—

బూనా: మిత్రమండలి విమానములు ఒక శత్రు విమానాశ్రయముమీద నున్ను, పరిసరప్రదేశముమీదను మూడుసారులు ప్రచండదాడులు గావించెను. భూమిమీదనున్న విమానములు, ఒక పెట్రోలు ఉగ్రాణము, తగులబడెను. గుడిసెలు, మోటారు బండ్లు, జపానువారు దిగుట కుద్దేశించిన బోట్లు నాశమయ్యెను. ఒక విమాన విధ్వంస శతఘ్నిక చెడగొట్టబడెను. మన విమానములకు శత్రువు లడ్డుతగులలేదు ఈబోట్లు క్రొత్తగా వచ్చినవి కొవనియు, మొదట జపాను వారు దిగినవేయనియు ఒక ప్రభుత్వాధికారి చెప్పెను.

శుక్రవారమునాడు న్యూగినీ సైరృతి బౌంబుచేయబడిన జపానీసు క్రూయిజరు విషయమై క్రొత్త వార్తలేమియు రాలేదు.

కకోడా: మనసేనలు, ఫైటర్ల తోడ్పాటుతో శత్రుహతశేషములను నాశముచేసిరి.

సైరృతిరంగము: గస్తీచర్యలు మాత్రము జరిగెను.

మిల్నాబేలో మిత్రమండలి రహస్య విమానాశ్రయము

ఢిల్లీ, సెప్టెంబరు 6:—

జపానువారు దిగుటకు పూర్వము మిల్నాబేలో మిత్రమండలివారి రహస్య విమానాశ్రయము నొకదానిని నేర్పరుచుటకు ఆస్ట్రేలియావారి నీలిజలవిమానములు తోడ్పడెను. ప్రచండమగు తుపాను గాలిలోను, వానలోను వెళ్లి ఆస్ట్రేలియా వైమానికులు శత్రువులకు తెలియకుండ రహస్య విమానాశ్రయమునకు సన్నద్ధులు చేర్చిరి.

ప్రాచ్యరాజ్యశాసనం

ప్రత్యేకంగా ప్రాచ్యదేశస్థుల కవసరం

సింహళంమంత్రి సూచన

కొలంబో, సెప్టెంబరు 6:—

సింహళమహాసభ ఆరవ వార్షికసమావేశం నేడు వెయినగోడలో జరిగింది. ఈ సభానాయకుడున్ను, సింహళము స్థానిక స్వపరిపాలన మంత్రియున్ను అయిన ఎస్. డబ్ల్యు. ఆర్. డి. బండరీనాయకెగారి సభలో వుపన్యసిస్తూ యీలాగు చెప్పారు.

"బ్రిటను అమెరికా దేశాలవారు కలసి అట్లాంటికు చార్టరును చేశారు. ఇది పాశ్చాత్యదేశములకు మాత్రమే వర్తిస్తుంది. తూర్పుదేశముల కన్నిటికిన్ని వర్తించేలాగు బ్రిటను అమెరికా రష్యా చీనా దేశాలవారు కలసి మరివకచార్టరును చేస్తేవారు చాలా ఘనమైన కార్యమును చేసినవారవుతారు. దీనివల్ల మిత్రమండలికి బలము కూడా చాలా అధికమవుతుంది.

సింహళములో వుంటున్న భారతీయులలో నిపుణులు గానివారు యిండియాకు సింహళమునకు రాకపోకలను సలుపుతూ వుండడాని కిదివరకున్న అభ్యంతరమును యిండియా దొరతనమువారిప్పుడు తొలగించారు. దీనివల్ల యెటువంటి ఫలితము కలుగుతుందో నే నిప్పుడు చెప్పలేను. ఇండియా సింహళ దేశములవారు పరస్పర స్నేహభావమును కలిగివుండవలెను గాని అందువల్ల యెవరికిన్ని అన్యాయము జరుగగూడదు. యుద్ధము ముగిసేవరకు యిప్పుడున్న పద్ధతినే అనుసరిస్తూ వుండవలెనని నేను యిండియా దొరతనమువారిని కోరుతున్నాను. సింహళమువారు క్రొత్తపద్ధతిని అవలంబించుట తప్పని సరిగా యేర్పడేలాగు యిండియా దొరతనమువారు చెయ్యరని నేను నమ్ముతున్నాను.

సింహళమహాసభ అనేది ఒక రాజకీయ సంస్థ. సింహళములో సింహాలి తెగవారికంటరికి యిది ఒక్కటే ప్రతినిధిసభ. సింహాలి తెగవారిలో యేకీభావమును కలిగించుట, యితేగవారు సింహళములో యితర మతముల వారితో కలిసి పనిచేయుట, యివే యీసభ యొక్క ముఖ్య ఆశయములు. జాతీయతవల్లనే దేశములో ప్రజలలో ఐకమత్యమున్ను, దేశాభివృద్ధియున్ను కూడా కలుగుతాయి. (అ. ప్రె.)

జిన్నాగారు పిడివాదమును వదిలితేగాని రాయబారాలు సఫలముకావు

వి. డి. సావర్కరుగారి ప్రకటన

బొంబాయి, సెప్టెంబరు 6:—

నేడిక్కడ జరిగిన పత్రికాప్రతినిధుల సభలో వి. డి. సావర్కరుగారు మాట్లాడుతూ హిందూమహాసభ జిన్నాగారితో రాయబారాలు జరపటం గురించి యీక్రింది విధంగా చెప్పిరి.

పాకిస్థానుకు అంగీకరించని పార్టీలతో నేను రాయబారాలను జరపను అనే పిడివాదమును జిన్నాగారు వదలుకోకపోతే రాయబారాలు సఫలముకావు. హిందూమహాసభవారిప్పటివరకున్ను ముస్లింలీగుతో ప్రత్యక్షముగా రాయబారములను జరుపుటకు ప్రయత్నించలేదు. అందువల్ల మహాసభను పరాభవించి తిరస్కరించుట కిప్పటివరకు జిన్నాగారి కవకాశము కలుగలేదు. తక్కిన అన్ని పార్టీలనాయకులున్ను ప్రయత్నించి తిరస్కృతులైనారు. గాంధిమహాత్ముడున్ను, జవహర్‌లాలుగారున్ను పాకిస్తానుకు అంగీకరించవలెనని ప్రచారముచేసిన సి. రాజగోపాలాచారిగారున్ను కూడా జిన్నాగారితో సంభాషించి పరాభూతులైనారు. గనుక జిన్నాగారు ఆహ్వానిస్తే తప్ప హిందూమహాసభ ప్రతినిధులు జిన్నాగారితో రాయబారములను జరుపుటవుచితము కాదు. 'పాకిస్తానుకు ముందుగా అంగీకరించవలెనని నేను పట్టుబట్టను' అని జిన్నాగారు స్పష్టముగా తెలుపవలెను.

ముస్లింలీగువారి చిత్తవృత్తి మారితేతప్ప వారితో సమాధానము కుదురదనే నాకు తోస్తున్నది. రాయబారములు జరుగుటకు ముందుగా పాకిస్తానుకు బ్రిటనుదొరతనమువారంగీకరించవలెననికూడా జిన్నాగారున్ను ముస్లింలీగువారున్ను అనేకసార్లు చెప్పివున్నారు. గనక యిటువంటి విషమపరతులను కోరనట్టి యితర అల్పసంఖ్యాక సంఘముల నాయకులతో మహాసభ ప్రతినిధులు రాయబారములను జరపవలెనేగాని జిన్నాగారితో రాయబారములను జరపవసరములేదు. జిన్నాగారితో రాయబారాలను జరిపితే లాభము కలుగదు. ఇతరసంఘముల నాయకులతో రాయబారాలను జరిపితే అనుకూలమైన ఫలితము కలుగవచ్చును.

'ఇండియా దేశస్వాతంత్ర్యమును గురించి కాంగ్రెసు ముస్లింలీగులున్ను అంగీకరిస్తే చాలును. ఈ రెండే యిండియాలో ముఖ్యమైన పార్టీలు' అని కొందరంటున్నారు.

దీనికి మహాసభవారెన్నటికిన్ని అంగీకరించరు. దీనిని వారు తీవ్రముగా ప్రతిఘటిస్తారు.

ఇట్లా అనటంలో హిందూ మహాసభ ముస్లింలీగుతో రాయబారాలు జరపటానికి సిద్ధంగాలేదని అర్థంకాదు. ఈమధ్య హిందూ మహాసభ చేసిన తీర్మానంలోగూడా భారత దేశంలోనిఅల్పసంఖ్యాకజాతులకన్నింటికిని, ముస్లిములకు రక్షణతోగూడిన భారత స్వాతంత్ర్య సమస్యనుగురించి అన్నిపక్షాలతోనుచాయబారాలు జరపటానికి యిష్టమును దెలియబరచిరి.

దేశంలో సమష్టి నియోజకవర్గములే వుండవలెనని మాపార్టీవారు కోరుతున్నారు. కాని ప్రత్యేకనియోజకవర్గము లుండక తప్పదని ముస్లింలీగువారు తెలిపేయడల దానికి కూడా మా పార్టీవారంగీకరిస్తారు. ఆయా మతముల జనసంఖ్యను బట్టే ప్రతినిధుల సంఖ్యను నిర్ణయించుటకు అన్నిమతముల వారున్ను అంగీకరించవలెనన్న పరతును మహాసభవారు వదులుకోవడానికి వీలులేదు. ఈపరతుకు తక్కిన మతముల వారందరున్ను అంగీకరించారు గనక ముస్లిములుకూడా అంగీకరించకతప్పదు. (అ. ప్రె.)

భారతదేశ సమస్య

డెప్యుటీప్రధాని ఆట్లీ సమీక్ష

విభేదములే అభివృద్ధి కాటంకములనుట

ఎడ్జ్‌బాస్, సెప్టెంబరు 6:—

విజయము తప్పక కలుగుననియు ఆంగ్లేయులు తమ యుద్ధప్రయత్నములను నిరసించి, ఇతరుల యుద్ధప్రయత్నములను ప్రశంసింపరాదనియు నేడిచ్చట నుపన్యసించుచు డిప్యుటీప్రధాని ఆట్లీగారు చెప్పిరి.

భారతదేశ సమస్య

తరువాత భారతదేశ స్థితిగతులవిషయమై వివరించుచు ఆయన యిట్లుచెప్పెను:—

భారతసమస్యను పరిష్కరించుటలో మనమనేక తప్పులు చేసియుంటిమి. కాని మనము ఒక శతాబ్దముపైగా భారతదేశములో శాంతి స్వపరిపాలన యేర్పడుటకు కారణభూతులమైతిమి. ఈ 25 సంవత్సరములలో భారతదేశము స్వపరిపాలన పొందుటకు మనము చాల తోడ్పడితిమి. భారతీయులలో విభేదము లేర్పడుట వలనను, భారతదేశములో 30 కోట్ల ప్రజలుండుటవలనను, ఈప్రజలలో కొందరు అభివృద్ధి నొందినవారు, కొందరు వెనుకబడినవారనుటవల్లను యింకను అభివృద్ధి కలిగించుట సాధ్యము కాకపోయెను."

హిందూమహాసభ

వుపసంఘమువారిప్రచారము

అమృతసరు, సెప్టెంబరు 6:—

భారతహిందూమహాసభ కార్యసంఘమువారిచే యెన్నుకోబడిన వుపసంఘసభ్యులలో డాక్టరు ఎన్. ముఖర్జీ, ఎస్. సి. ఘటర్జీ, రా॥ బా॥ ఎం. సి. ఖన్నాగార్లు లాహోరునుంచి యీవాళ పొద్దున్న అమృతసరు వచ్చారు. వీరు నేడిక్కడ వివిధపార్టీల నాయకులతోను, వివిధమతముల నాయకులతోను సంభాషించారు. మాస్టరుతారాసింగు, సర్దారు యీశ్వరసింగు మజహాయలు, డా॥ సయిఫుద్దీనుకిచలూ, అమృతసరు ముస్లింలీగు అధ్యక్షుడు షేకుసదిక్‌పహంస్సేనుగార్లు మొదలయినవారితో వీరు మాట్లాడారు. వీరు నేడే ఢిల్లీకి వెళ్లారు. (అ. ప్రె.)

ముద్దులొలుకు ముఖారవిందము

మీరు యెన్నడును బడయజాలని గొప్ప అస్తి ముద్దులొలుకు ముఖారవిందము.

వేపనూనెతో చేయబడిన మార్గోసబ్బు ఒక్కటే సిద్ధపైన సబ్బు. వేపనూనె చర్మమునకు అమూల్యమైన తైలమని చర్మ నిపుణుల ఉద్దేశము.

ప్రతిరోజు మార్గోసబ్బును వాడి మీ ముఖలావణ్యమును కాపాడుకొనుడు.

మార్గో సబ్బు

టాయిలెట్ & మెడిసనల్

కలకత్తా కెమికల్



గంటలపంచాంగం

చిత్రభాను సం॥ శ్రావణ బ॥ త్రయోదశీ 1942 సం॥ సెప్టెంబరు 8 మంగళవారం
మం॥ త్ర రా 7-13 ఆశ్రే రా 11-29 వర్జ్యం ప 11-23 మొ 1-7 కు.
బు॥ చతు॥ సెప్టెంబరు 9 బుధవారం
బు॥ నతు రా 8-9 ను రా 1-1 వర్జ్యం ప 12-15 మొ 1-57 కు.



ఆంధ్రపత్రిక
1942-వ సం॥ సెప్టెంబరు 7 తేది సోమవారము

కఠిన శిక్షలు

కొరడాదెబ్బల శిక్షలను సభ్య ప్రపంచ మంతయు, అహానుపమగు అనాగరకలక్షణముగ పరిగణించి ఖండించుచున్నది. బ్రిటను, అమెరికాలవంటి దేశముల యందు ఈ శిక్షను పూర్తిగ రద్దు చేసి ఇతర పద్ధతుల ననుసరించు చున్నారు. ఈ దేశమునందు గూడ కొరడాదెబ్బల శిక్షలపద్ధతిని రద్దు చేయవలె నని ప్రజలేగాక, ఆంగ్ల దేశమునందలి ప్రముఖులు గూడ ఆందోళన జేయుచుండిరి. అట్టిదో, అత్యల్పమగు కొన్ని నేరములకు గూడ కొరడాదెబ్బల శిక్షలను మరణశిక్షలను విధించుట కధికార మొసగుచు ప్రభుత్వమువారి రిటీవల గావించుచున్న ఆర్డినెన్సులును, రాష్ట్రీయ ప్రభుత్వములు గావించు చున్న ప్రకటనలును, ఉభయదేశములయందును, శాంతిసమాధానముల వాంఛించువారికి నిరాశను గల్గింప జేయుచున్నవని చెప్పుటయందేమాత్రమును అతిశయోక్తి లేదు.

ఈ శిక్షల తీవ్రతవలన, భీతాహము వ్యాపించి, ప్రజలు శాసనోల్లంఘన నేరములనుండి విరమించుకొనెదరని అధికారులు భావించు చున్నటులున్నది. కాని, నిజమగ సత్యాగ్రహులకు ఈశిక్షలు బెదరు కల్గించునని తలఱచుట పొరబాటు, శిక్షలు క్రూరమైన కొలదియు, ప్రజలలో అధికారవర్గముపై ద్వేషము తీవ్రతరమగునను విషయము మరువరాదు. ఇట్టి శిక్షలవలన తాత్కాలికముగ ఉద్యమమును అణచగల్గిననుగూడ-దానివలన ప్రజాహృదయములపై నాటుకొను ద్వేషరోషములు తరతరములవరకును నిలచియుండి, ఆంగ్ల-భారతజాతుల మైత్రికి ప్రబల మగు ప్రతిబంధకములుగ నుండును. ఈ విషయమున, ఐర్లండు యొక్క నిదర్శనము గల బ్రిటిషు నాయకులు విస్మరింపరాదు. ప్రాతగాథలు ఐరిషు జాతీయహృదయమును కలకవేయుచుండనిచో, నేడు బ్రిటను అతిక్లిష్టమగు సంగ్రామమున దగుల్గొనియున్నపుడు ఐరిషు జాతి, తన కేవియు సంబంధించనియట్లు తటస్థముగ నిలచియుండెడిది గాదు.

ఈ సందర్భమున స్పెషలు క్రిమినలు కోర్టుల ఆర్డినెన్సుక్రింద, సైదాపేట సబుడివిజనలు మేజస్ట్రేటు, ఇద్దరు విద్యార్థులకు కొరడాదెబ్బల శిక్షల విధించుచు గావించిన ఉత్తరువు మరింత క్రూరముగనున్నది. సదరు విద్యార్థులు చేతిలో రాళ్లతో రైలుమార్గముపద్ద నిలచియుండి రనియు, రైలులో పోవుచున్న ప్రయాణికులపై రాళ్లు విసరిరనియు వారిపై నేరమారోపింపబడెను. ఇట్టి చర్యలను ప్రతిపౌరుడును గర్హించి ఖండించుననుటకు సందియము లేదు. కాని ఆ నేరమునకు, తగిన ఇతర విధము లగు శిక్షలు విధింపవచ్చునే గాని, నాగరిక ప్రపంచమునే ఖండింపబడిన అతిక్రూరమగు ఈ శిక్షను విధించియుండనక్కరలేదు. అంతియగాక, పైనుదహరింపబడిన స్పెషలు కోర్టుల ఆర్డినెన్సు, ఈ దేశముపై శత్రు దాడులు జరుగుచో నేర్పడు అరాజకపు పరిస్థితులయందు దుండగులును, శత్రు గూఢచారులును గావించు, నేరములకుగాను గత జనవరిమాసమున గావింపబడెను. అంతియగాని, శాంతిసమయములకును యుద్ధప్రయత్నములకు భంగముగల్గించుటతో సంబంధము లేని ఇతర నేరములకును ఉద్దేశింపబడినది గాదు. అట్టి ఆర్డినెన్సునిట్టి విద్యార్థులపై ప్రయోగింపదగు నని ప్రభుత్వమువారైనను నుడివెదరని తలంపము. అందుచే, ఇట్టి శిక్షలవలన ప్రజలయందు గల్గు ఫలితముల గుర్తించి, ప్రభుత్వమువారు వెంటనే జోక్యము గల్గించుకొని పై శిక్షల రద్దుచేసెదరని ఆశించుచున్నాము.

వ్యాఖ్యలు-విమర్శలు

బొంబాయి అఖిలభారత కాంగ్రెసు సంఘ సమావేశానికిముందు అమెరికన్ పత్రికాభిప్రాయాలను విసుపూ విరామం లేకుండా బండ్లతో భారతదేశానికి రవాణా చేసిన రాయిటర్ వార్తాహరు డెందుచేత దెప్పాడు కాంగ్రెసు నాయకుల నిర్బంధానంతరం కిమిన్నాస్తిగా పూరుకున్నాడు! అమెరికన్ పత్రికలుగాని, అమెరికన్ప్రజలుగాని భారతసమస్యల నికవర్చించరాదని హితాత్మగ అభిప్రాయం నూర్పుకున్నారా? లేక, బొంబయి సమావేశానికి పూర్వం ప్రధానంగాను, ప్రస్తుతంగానూ, సంగతంగానూ తోచిన అమెరికన్ పత్రికాభిప్రాయాలు బొంబయి సమావేశానంతరం అప్రధానంగానూ, అప్రస్తుతంగానూ, అసంగతంగానూ తోచినవా? ప్రభుత్వంవా రవలంబిస్తూన్న నిర్బంధ విధానంపట్ల అమెరికన్ పత్రికలు ప్రకటించే అభిప్రాయాలు భారతప్రభుత్వంవారికి రుచించటం లేదా?

* * *

ఏ హేతువుచే పైతేసేం రాయిటర్ వార్తాహరుడు ఈ సందర్భంలో మూగశోకం వోస్తున్నాడు. నలుపును తెలుపూ, తెలుపును నలుపుగాచేసి అసత్యప్రచారం చెయ్యటం కంటె ఇదీ కొంతమేలే. ఐతే, ఆమాత్రం సంతృప్తికూడా మనకు దక్కకుండాచేశాడు రాయిటర్ సంజయుడు. వాషింగ్టన్‌లో జరిగిన అంతర్జాతీయవిద్యార్థిమహాసభా విశేషాలు తెలియజేస్తూ, భారత ప్రతినిధిగా శ్రీ చంద్రశేఖర్ అనువారు తాను బ్రిటిషువారికి అనుకూలుడననిన్నీ, బ్రిటిషువారి ఏలుబడి కిందనే భారతదేశం స్వతంత్రం పొందటానికి ఎక్కువ అవకాశం వున్నదనిన్నీ, భారత ప్రజానీకం ఈ సంగతిని గ్రహించలేకుండా వున్నదనిన్నీ ఉపన్యసించినట్లు మనకు అందజేశాడు.

* * *

కాని, వాషింగ్టన్ నుంచి 'హిందూ' ప్రత్యేకవిలేఖరి పంపిన వార్తనుబట్టి శ్రీ చంద్రశేఖర్ జంటనే భారతదేశానికి స్వతంత్రం కోరవలసిందిగా సభవారిని ఉద్బోధించాడట. తాను బ్రిటిషువారికి విరోధికాదుగాని భారతదేశానికి అనుకూలవాదినని, భారతసమస్యను పరిష్కరించినట్లయితే ప్రపంచజనాభాలోని ఐదవవంతు ప్రజలసమస్య తీరినట్లనీ హెచ్చరించాడట! తుదకు అంతర్జాతీయవిద్యార్థి మహాసభ భారతస్వాతంత్ర్యానికి అనుకూలంగా తీర్మానించింది. రాయిటర్ వార్తకూ, హిందూ ప్రత్యేకవిలేఖరి వార్తకూ గల తేడా తెల్లమేకదా!

పనిబెట్టుకొని చేసే అసత్యప్రచారం కంటె దానమే కొంతమేలు!

* * *

యుద్ధనిర్వహణపరంగాను బ్రిటిషు పార్లమెంటులోని కన్సర్వేటివు, లిబరల్, లేబరు పక్షాలు మూడూ ఏకీభవించినప్పటికీ, ఈ మూడు పక్షాల సిద్ధాంతాలలో మాత్రం ప్రస్ఫుటమైన భేదం పొడగట్టుతూనే వుంది. నిన్న లండనులో జరిగిన లిబరల్ పక్షం యొక్క వార్షిక సమావేశంలో యుద్ధానంతర సమస్యలను గురించి ఒక తీర్మానం ఆమోదించబడింది. వర్గభేదాలను పూర్తిగా తుడిచివేయవలసిందనీ, ఆస్తిగాని, స్వస్థులకు ప్రత్యేకలాభాలుగాని లేనట్టి సాంఘిక వ్యవస్థను స్థాపించవలసిందనీ ఈతీర్మానం అసందిగ్ధంగా కోరుతున్నది.

ఇంతకు క్రితం లండనులో కార్మికపక్షం వారు సభజరిపి, పునర్నిర్మాణ విధానాన్ని అమలుజరపటానికి యుద్ధానంతరం వరకు వేచివుండక యిప్పటినుంచే ఆచరణలో పెట్టవలసిందనీ, ప్రస్తుత ప్రభుత్వవిధానంలో ధనవంతులకు యెక్కువ పలుకుబడి ఏర్పడివున్నదనీ, అదిసడలిపోతేనేగాని యుద్ధానంతరం సాంఘికమైన శాంతిభద్రతలకు భంగంఏర్పడక తప్పదనీ తమఅభిప్రాయంగా తెలియజేశారు. కార్మికపక్ష వైఖరినిగురించి హెరాల్డ్ జె. లాస్కీగారు న్యూ స్టేట్సుమన్ పత్రికలో రాస్తూ కార్మికపక్ష సిద్ధాంతాలు అమలు జరపటానికి, యుద్ధనిర్వహణకుగాను బ్రిటిష్ రాజకీయపక్షాలు ఏర్పరుచుకున్న సంధి బడిక అడ్డురాకూడదనీ, ఛేంబర్లేను ప్రధానిగా వున్నప్పుడు కార్మికపక్షం ప్రతికూల వర్గంలోవుండే యుద్ధాన్ని బలపరచిందనీ, ప్రతికూలవర్గంలో వున్నప్పటికంటే చర్చిలుతో చేతులు కలిపినందువల్ల కార్మికపక్షానికి కొత్తగా ఏమీ లాభించలేదనీ, కార్మికపక్షంవారు నిర్ణయించిన సాంఘిక విధానానికి చర్చిల్‌మంత్రి ప్రతికూలుడైనయెడల కార్మికపక్షం ప్రభుత్వంతో సంబంధం తెంపుకొని ప్రతికూల వర్గంగా పనిచేయడమే ఉత్తమమని సూచించారు.

* * *

బ్రిటిష్ లిబరల్, లేబరు పక్షాలవారు ఉభయులూ సాంఘికవ్యవస్థలో విశేషమైన మార్పులు జరగాలని పైవిధంగా తమ అభిప్రాయాలు ప్రకటిస్తే కన్సర్వేటివు పక్షంవారు మాత్రం ఇప్పుడుగాని, యుద్ధానంతరంగాని ఇలాంటి పరివర్తనలకు ఏమాత్రం సుముఖులుగా వున్నట్టు కనుపించరు. అంతేకాదు. యుద్ధానంతర పునర్నిర్మాణాన్ని గురించి కన్సర్వేటివు పక్షంవారు ప్రకటించిన నివేదికలో మార్క్స్ సిద్ధాంతాలకూ, సామ్యవాదానికీ కమ్యూనిజానికీ, మరేవిధమైన ఆర్థికజాతీయ సిద్ధాంతాలకు, సహా ప్రాతికూల్యం పలికిబుచ్చుతూ బ్రిటిషు జాతీయజీవితంలో మతం ప్రధానంగా వుండవలెననీ, తీవ్రమైన మతప్రబోధమే ఈ సమస్యలన్నిటిని పరిష్కరించగలదనీ సిద్ధాంతం చేశారు.

* * *

ధనికవర్గానికి చెందిన బ్రిటిషు కన్సర్వేటివుపార్టీవారు సాంఘిక వ్యవస్థలో ఏవిధమైనమార్పులూ రాకుండా, తమ ప్రాబల్యం ఇప్పటివలెనే ఎప్పటికీ చెక్కుచెదరకుండా వుండవలెనని కోరటంలో ఆశ్చర్యం ఏమీ లేదు. కాని, కొయకట్టువల్ల జీవించే సామాన్యప్రజలను కాల్లగొట్టి లాభాలుగణించే ఈధనస్వాములు మతప్రబోధాన్ని గురించి ఇంతటి భక్తిశ్రద్ధలు ప్రకటించడం మాత్రం విడ్డూరంగా తోచక మానదు. యూరోపియన్ జాతులు నిజంగా క్రైస్తవమతబోధనల ప్రకారం నడుచుకుంటేనా రయినట్లయితే ప్రపంచంలో ఈ విద్వేషానలంగాని, ఈ ఘోర యుద్ధాలుగాని, ఈ మహాసంక్షోభంగాని జనించేవుండవు.

* * *

"పాపాన్ని ద్వేషించు, పాపంచేసిన వారిని కరుణించు, అని క్రైస్తవమతం బోధిస్తున్నది. ఇది చాలా కఠినమైన సూత్రం యుద్ధసమయంలో క్రైస్తవమతాన్ని గురించి మాట్లాడటానికే వీలులేదు." అని సి. యి. యం. జోడుగారన్నారు. యుద్ధనిర్వహణలో ప్రధానభాగస్వాములు కన్సర్వేటివు పార్టీవారు. ఒకచెంపపై దెబ్బకొట్టినప్పుడు పైకి రెండవచెంప చూపుడని యేసుక్రీస్తు చెప్పియుండగా, 'మతసంబంధమైన సాత్వికత ప్రజలలో నిరోధకశక్తిని తగ్గిస్తుంది కాబట్టి అట్టి సాత్వికతను ప్రోత్సహించరాదని' కన్సర్వేటివ్ పక్షం కోరుతున్నది. ఇదే కాబోలు కన్సర్వేటివుల మతప్రవృత్తి!

చీనాకు భారతసేనాపతి సందేశము

చీనా సేనలకు ఆహ్వానము

చుంకింగు, సెప్టెంబరు 6:—

మూడవ యుద్ధవార్షికోత్సవముల సందర్భమున పంపిన సందేశమునకై కృతజ్ఞతలు పుచు భారత సర్వసేనాధిపతి జనరల్ సర్ ఆర్చిబాల్డు వావెలు గారు జనరల్ హోయిసాచిన్ గారికీ క్రింది సందేశమంపిరి:

ఇప్పుడీదేశములో పనిచేయుచున్న చైనాసేనలను నేను భారతదేశమున కాహ్వానించుచున్నాను. చీనావారు జపానుతో గావించుచున్న ఆరవసంవత్సరయుద్ధములో చీనాకు కలిగిన విజయములు ప్రపంచప్రజల ప్రశంసకు పాత్రములైనవి. మీకును, మీ మహానాయకునకును అభివాదనములు.

ఆక్యాబ్‌పై బ్రిటిషు విమానదాడి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6:—

విమానశాఖాధికారు లీ క్రింది ప్రకటన గావించుచున్నారు:—

నిన్న రాయల్ విమానదళము ఆక్యాబ్‌పై దాడిగావించెను. లక్ష్యములపై బాంబులుపడెను. ఒక బాంబు ఆక్యాబ్‌కు దక్షిణముగా బర్మాసముద్రతీరము మీదికి నల్లి టాంగప్ దగ్గర ఒక ముఖ్యరోడ్డుపై సూటిగా బాంబులు వేసెను. (అ. ప్రే.)

స్టాలిన్‌గ్రాడు సమీపమున పోరాటము

శత్రుగమనము తాత్కాలికముగా నిలువరింపబడినది

డాన్ పడమటితీరమున రష్యనులు తిరుగుదాడులు ప్రారంభించుట కవకాశము

కాకససురంగంలో గ్రాజ్నీమార్గమున జర్మనుల కష్టములు

స్టాలినుగ్రాడు రంగం

లండను, సెప్టెంబరు 7:—

నేడు నెలవడిన రష్యను ప్రకటనలో ఇట్లు కలదు:—

"స్టాలిన్‌గ్రాడుకు ఉత్తరమున కొన్ని స్థలములను రష్యనులు ఆక్రమించిరి. 350 మంది జర్మనులు మరణించిరి.

దక్షిణమున యుద్ధము ప్రతినిమిషమునకు తీవ్రతర మగుచున్నది. శత్రుదాడులకు జవాబుచెప్పి రష్యనులు, ఉన్న స్థలములలో నిలువద్రొక్కుకొనిరి. 2 జర్మను సైనికకంపెనీలు సర్వనాశనమైనవి.

నాశనమైన వారిస్థానం ఆక్రమించుటకు కొత్త జర్మనుసేనలు వచ్చి పడుచున్నవి. రష్యను ఫిరంగుల కెదురు నిలిచిన శత్రుసేనల కొన్నిటిలో ఏబది అరువదిమంది కన్న ఎక్కువమంది సైనికులు మిగలలేదు. కాని వెనుకనుండి జర్మను సేన ప్రవాహరూపముగా వచ్చుట రష్యనులకు పెద్ద సమస్యగా నున్నది.

స్టాకుహోం, సెప్టెంబరు 6:—

స్టాలిన్‌గ్రాడునకు ఉత్తరమున సుమారు 20 మైళ్ల దూరంలో వాల్గా నది మీదనున్న డుబోవ్కాకును, స్టాలిన్‌గ్రాడుకును మధ్య జర్మనుసేనలున్నవి. స్టాలిన్‌గ్రాడుకు దక్షిణమున 12 మైళ్ల దూరంలోనున్న క్రాస్నోవారుకును స్టాలినుగ్రాడుకును మధ్య జర్మనుసేనలున్నవి.

మధ్యప్రదేశములో కలాచ్‌నుండి సూటిగా, తూర్పుగా డాన్ వాల్గా నదులను కలుపుకాలువయొక్క ఒడ్డులమీదుగా స్టాలిన్‌గ్రాడు వంకకు శత్రువురోగమనము సాగుచున్నది.

స్టాలిన్‌గ్రాడునగరమున కీవిధముగా శత్రువువల్ల ప్రమాదము నానాటికి హెచ్చుచున్నను రష్యనులు రెండుచోట్ల సేనలను కేంద్రీకరించుచో విజయమున కవకాశమున్నది. నగరమునకు ఉత్తరమున డుబోవ్కా-ఇలోవల్యా ప్రదేశమునకు రష్యనులు గొప్పసేనలను చేర్చగలిగిన ఈ రంగంలో యుద్ధస్థితి శత్రువుకు ప్రతికూలంగా మార్పు పొందుననుటకు సందేహములేదు. ఇంకను పడమర డాన్‌నది పడమటితీరమున గొప్ప సేనలను తేగలిగినను అట్టి ఫలితము కలుగునని ఎలనగా నగరమునకు సమీపముగా ఉత్తరమునను దక్షిణమునను గల సేనలు శత్రువుచే చుట్టివేయబడి వాల్గానది ఒడ్డుననిలిచి పోరుచు ప్రమాదకరమగు స్థితిలో నున్నవి గాని డాన్ పడమటితీరములో నున్న సేనలావిధముగా చుట్టివేయబడలేదు. మాస్కోనుండి వచ్చు రైలుమార్గమువీరుగా సేనలను రష్యనులు పైరెండు స్థలములకు తీసికొనివచ్చుటకు మంచి వీలుకలదు.

ప్రస్తుత యుద్ధస్థితి

ఈ రెండుస్థలములలో తాము గొప్ప సేనలతో తిరుగుదాడులు ప్రారంభించువరకును స్టాలిన్‌గ్రాడుకు సమీపమున శత్రువును నిలువరించుట రష్యనుల ఉద్దేశ్యమై యున్నది. ఆ ఉద్దేశ్యము తాత్కాలికముగా నెరవేరినదనియే చెప్పవచ్చును. స్టాలిన్‌గ్రాడుకు సమీపమున ఉత్తరమునను దక్షిణమునను గూడ శత్రుసేనను వారు నిలిపివేయ గలిగిరి. దక్షిణమున శత్రు నిజృంభణము చాలా ఎక్కువగా నుండెను. ఇచ్చట జర్మను టాంకు దళములు కాల్బలములు నాలుగుసార్లు అతి తీవ్రముగా దాడిసలిపెను. ఇంతకుముందు రష్యాలో ఎచ్చటనైనను యుద్ధ మింత తీవ్రముగా నుండెనా యనిపించెను. కాని నాలుగుదాడులను రష్యనులు మరలింపగలిగిరి.

మార్గమున శత్రువుకు ఆటంకములు

అడుగడుగునకు ముండ్లతీగెలు, పలుచోట్ల ఉంచబడిన ప్రేలుడు మందుగనులు, ఎటుచూపు పట్టిన అటుతిరిగి గుండ్లు ప్రేల్చగల ఫిరంగులు అమరిక, శత్రు సందర్శన మాత్రమున ఆకాశముబద్దలగునట్లు ఘూర్ణిల్లు పెద్ద ఫిరంగులు, నగరమువంకకుపోవు శత్రువుకు గల ఆటంకములలో కొన్నిమాత్రమే. చెడిపోయిన టాంకులను భూమిలోపాతి దాని వెనుక రష్యను సైనికులు నిలిచి గుండ్లు ప్రేల్చుచున్నారు. చాలా చోట్ల క్రొత్త టాంకులు శత్రువుకు తెలియనిచోట్ల దాచియుంచబడినవి. వాటిసర్తు తెలియకుండ శత్రువు ముందుకుపోవుచో నాలుగువైపుల నుండివచ్చి ఆక్రమించి ఆటాంకులు శత్రుసేనల నురుమాడగలవు.

నగరములో సన్నాహములు

నగరములో ప్రతి ఇల్లు రష్యనుసైనికులతో నిండి ఒకచిన్నకోటవలె నున్నది.

రష్యను ప్రకటన

రష్యను ప్రకటనలో ఇట్లు కలదు:—

"నగరమునకు ఉత్తరమున జర్మనుసేనను త్రోలివేసితిమి. కడచిన కొలదిదినములలో 3 వేల జర్మనులు మరణించిరి.

దక్షిణమున నగరమును చేరుకొనుటకై యత్నించు శత్రుటాంకుదళములతోను కాల్బలములతోను ఘోరయుద్ధము జరిగెను. మాదే పైచేయియైనది. శత్రువును తరిమివేసితిమి. ఇచ్చట జర్మను కాల్బలములకు సహాయముగా విమానముల మొత్తములు వచ్చెను. సైనికులును వారికి అధికసంఖ్యగా నుండిరి. కాని చివరకు ఫలితమిట్లయినది. మా ఫిరంగులర్భుతముగా పనిచేసెను. 120 మంది సైనికులను శ్రుటిలో పరిమార్చెను."

క్రొత్త రష్యను సేనల రాక

క్రొత్త రష్యనుసేనలు స్టాలిన్‌గ్రాడు రంగమునకు వచ్చినట్లు జర్మను ప్రకటన ఒప్పుకొనెను.

వెలుపలి రక్షణలవద్ద పోరాటము

దక్షిణమున నగరముయొక్క వెలుపలి రక్షణలవద్ద పోరాటము సాగుచున్నదనియు స్థితిగతు లింకను విషమముగానే యున్నవనియు రాయిటరు ప్రత్యేకవిలేఖరి వృత్తాంతములో కలదు. జర్మనులను ఎంతనష్టమునకు లోనుబరచినను జర్మనులవత్తిడిమాత్రము తగ్గుటలేదని ఇతడు చెప్పుచున్నాడు.

కాకససు రంగం

మాస్కో, సెప్టెంబరు 6:—

కాకససు పడమటిభాగములో నవరాసిస్కు వద్ద జర్మనులధాటికి ప్రతిష్టంభన మేర్పడినది. కాని క్రొత్తసేనలను శత్రువు తెచ్చుచున్నాడు. జర్మనువిమానము లిచ్చట అధికముగా కలవు.

కాకససు తూర్పుభాగమున మజ్దాక్ ప్రదేశంలో విశేషమగు జర్మను కాల్బలము 35 టాంకులతోసహా టెరెకునదిని దాటి నది దక్షిణపుఒడ్డున స్థావరము లేర్పరచుకొనజూచెను గాని చాలా తీవ్రమగనష్టమునకు లోనయ్యెను. 35 టాంకులలో 15 ధ్వంసమైనవి. ఇచ్చటినుండి గ్రాజ్నీ పెట్రోలుగనులను ప్రీలైనంతత్వరలో చేరుకొనుటకుశత్రువు ఉత్సాహపడుచున్నాడు: గాని రష్యను ప్రతిఘటనమువల్ల అతనివేగము మందగించుచున్నది. రెండు జర్మను సైనికకంపెనీలును ఒక రుమేనియను ఆశ్వికదళమును హతమయ్యెను. క్రొత్తసేనలను తెప్పించుకొనిన తర్వాతగాని శత్రువు కొన్నిఅడుగులు ముందుకు వేయగలుగలేదు.

లండను, సెప్టెంబరు 7:—

కాకససు రంగంలో నవరాసిస్కువద్ద మొదట ఒక రుమేనియను కాల్బలపటాలము నిశ్శేషమయ్యెను. కాని తర్వాత గొప్ప శత్రుసేన ముందుకు వచ్చుటవల్ల తమసేనలు వెనుకకు పోక తప్పినదికావలియు, గ్రాజ్నీ మార్గమున మజ్దాక్ ప్రదేశములో ఒక కొండ కొరకు పోంటము జరుగుచున్న దనియు నివ్వరకు వెలువడిన రష్యనుప్రకటన తెలుపుచున్నది. టెరెక్‌నది దక్షిణతీరమునకు జర్మనులు చాలా టాంకులను సేనను తీసికొనిరాగలిగిరి.

మాస్కో రంగం

లండను, సెప్టెంబరు 7:—

మాస్కోరంగంలో కొన్ని స్థలములను రష్యనులు ఆక్రమించుకొనిరి.

ఆజెవు పట్టణ సరిహద్దువద్దనే ఇంకను యుద్ధము జరుగుచున్నది. ఇట్లలో నున్న జర్మను సైనికులను రష్యను మట్టుపెట్టుచున్నారు.

కొన్ని గ్రామములు రష్యనుల వశమైనవి.

లెనిన్‌గ్రాడు రంగం

లెనిన్‌గ్రాడు నగరమువద్ద కడచిన రెండు దినములలో జర్మను విమానసంరంభము హెచ్చినది. 39 జర్మను విమానములు కూల్చబడినవి. మరి ఆరెంటికి దెబ్బ తగిలెను.

మదరాసు కళాశాలలు

4 కళాశాలల విద్యార్థులు తరగతులకు హాజరైరి

మదరాసు, సెప్టెంబరు 7:—

మదరాసులో నేడు ప్రెసిడెన్సీకాలేజి విద్యార్థులు అధికసంఖ్యాకులు తాము గత వారం సాగించిన సమ్మెనుమాని తరగతులకు హాజరైరి. బహుశా నూటికి 20 మంది హాజరుకాలేదు. ఈవాళ హాజరు కాకపోతే పేర్లు కొట్టివేయబడునని ప్రిన్సిపాలు విద్యార్థులకు నోటీసు యిచ్చియుండెను.

మేరీరాణీ కాలేజి విద్యార్థినులు యీదినం సమ్మెమాని యథాప్రకారంగా తరగతులకు హాజరగుచున్నారు.

మెడికలువిద్యార్థులు

మదరాసు మెడికలుకాలేజి, స్టాన్లీమెడికలుకాలేజి విద్యార్థులు కూడా యీవాళ అందరు తరగతులకు వెళ్ళిరి. అయితే ఈ రెండు కాలేజీల హాస్టెలులలో నుండిన విద్యార్థులు అక్కడవారు ప్రతిష్ఠించిన కాంగ్రెసు జెండాను వెంటనెత్తుకొని హాస్టెలులనువదిలి వెళ్లిపోయిరి. పతాకం ఎత్తివేయవలెనని ప్రిన్సిపాలులు 48 గంటల వ్యవధితో నోటీసును విద్యార్థులకు యిచ్చియుండిరి. పతాకం తీసివేయటానికి సమ్మతింపక విద్యార్థులు హాస్టెలులనే వదిలివేసిరి. ఈ విద్యార్థులిపుడు ప్రైవేటు యిండ్లలో, నున్నారు. తరగతులకు యీ వాళ హాజరైన వారివిషయమై వెనుకటిచర్యలకై ప్రతిక్రియను అధికారులు గైకొనరని ప్రకటించిరి.

యూనివర్సిటీ విద్యార్థుల క్లబ్బుభవనం మీద ప్రతిష్ఠింపబడిన జాతీయపతాకం ఇంకా ఆ భవనంమీద ఎగురుచున్నది.

ఇంజనీరింగు కాలేజి విద్యార్థులు యీవాళ తరగతులకు హాజరుకాలేదు.

లయోలాకాలేజి విద్యార్థులుకూడా అధిక సంఖ్యాకులు నేడు పరీక్షలకు హాజరైరి. తరగతులకు హాజరైన వారిమీద ఎట్టిచర్యలైగొనుటలేదని ప్రిన్సిపాలు తెలిపెను.

పచ్చయప్ప కాలేజి

పచ్చయప్పకాలేజి విద్యార్థులు అధిక సంఖ్యాకులు నేడు తరగతులకు వెళ్లలేదు.

రైళ్లు ఆలస్యంగా వచ్చుట

మదరాసు, సెప్టెంబరు 7:—

కలకత్తామెయిలు యీదినం ఉద 11-25 గంటలకును, బొంబాయి మెయిలు ఒకగంట 40 నిమిషములనేపు ఆలస్యముగను మదరాసుకు వచ్చెను.

ట్రాముబండి తగులబడుట

మదరాసు, సెప్టెంబరు 7:—

ఒకట్రాముబండి ఎగ్మూరుస్టేషనుద్దవద్ద అకస్మాత్తుగా నిప్పంటుకొనెను. కాని మంటత్వరలో ఆర్పివేయబడెను. దీనివల్ల వెనుకనుండిన మరొక ట్రాముబండికి కొంత నష్టమేర్పడెను.

మదరాసు, సెప్టెంబరు 7:—

శ్రీ బొబ్బిలి రాజాగారు బొబ్బిలినుండి నిన్న చెన్నపురికి వచ్చిరి.

వి. హెచ్. మాస్టరమన్ ఐ. సి. యస్. గారు విశాఖపట్నంనుండి నేడు దయం చెన్నపురికి వచ్చిరి.

ఆరోగ్యశాఖా డైరెక్టరు డా॥ ఆర్. అదిశేషన్ గారు నేడుదయమున బెజవాడకు వెళ్లిరి.

రష్యనుల విపరీత సైనికనష్టం

లండను, సెప్టెంబరు 6:—

రష్యనుసైన్యము కోల్పోవుచున్నదనియు యుద్ధము చాలా ఘోరముగా నుండుటవల్ల స్టాలిను చాలా హెచ్చుగా నున్నదనియు బ్రిటనులోని రష్యను రాయబారియగు మెయిస్కీగారు వెల్లడించి యింకను ఇట్లు చెప్పిరి:—

జర్మనీవినాశమునకు బ్రిటను రష్యాల కార్యక్రమం

బ్రిటను తనయావత్తు విమానబలమును జర్మనీపై బాంబులు వేయుటకు ఉపయోగించవలెను. కొన్నిరోజులు వెయ్యి విమానముల నీకార్యమునకుగాను బ్రిటను పంపిన వార్తలను వినినపుడు రష్యను లపరిమితానంద భరితులైరి. ఇంకను ఎక్కువశక్తిని అందుకుగాను బ్రిటను వినియోగించునని రష్యను లెదురుచూచుచున్నారు. రాత్రిపగలు బాంబులువేసి జర్మనీని నాశనము చేయవలెను. జర్మనీ అన్నిమూలలును బాంబులను చవిచూడవలెను. ఇందువల్ల యుద్ధములో ముఖ్యమగు మార్పుకలుగును, మీ వైమానికులును మావైమానికులునుతరచు జర్మనీలో కలసికొనుచుండగలరు. మన ఉభయదేశముల విమానబలము ముందర ఈవిధంగా శత్రువు క్రుత్తుర్లగాంచిన తర్వాత విశేషనష్టం లేకుండ శత్రువును ఓడించగలుగుదుము"

రష్యనుసేనలకు విజ్ఞప్తి

మాస్కో, సెప్టెంబరు 6:—

చరిత్రాత్మకమైన స్టాలిన్‌గ్రాడు నగరమును విశేషమగు సహజసంపదగల కాకససును కబళించు శత్రువును ప్రాణము లొడ్డియైనను ప్రతిఘటించవలెను గాని ఇంకొక్క అడుగైనను వెనుకకు వేయరాదని రష్యను రేడియో సేనలను ప్రబోధించినది.

చెన్నరాష్ట్ర పరిస్థితి

మదరాసు, సెప్టెంబరు 7:—

విశాఖపట్నం జిల్లాలో ఒకబోర్డు హైస్కూలు పాకలు మూడోతేదీన తగులబెట్టబడెను. ఇతర చోట్లనుండి ఏమీ వార్తలు రాలేదు. అని మదరాసు ప్రభుత్వం యీదినం ప్రకటించెను.

మద్రాసు విశ్వవిద్యాలయం

యం. యల్. డిగ్రీ పరీక్షా ఫలితములు

మదరాసు, సెప్టెంబరు 7:—

బ్రాంచి II కాన్స్టిట్యూషనలు లా యెవరును ప్యాసుకాలేదు.

బ్రాంచి III క్రైము-టార్ట.
iii క్లాసు
7 వి. బాలసుబ్రహ్మణ్యన్.
8. వి. పి. గోపాలకృష్ణంబియార్.

బ్రాంచి Iv కాంట్రాక్టు: ఎవరును ప్యాసుకాలేదు.

బ్రాంచి v హిందూ మహమ్మడన్ లా ఎవరును ప్యాసుకాలేదు.

WANTED

CANDIDATES for Station-Master and Signaller's Course Rs. 95, contain Scholarship, free lodging, charges and railway fare terms. Send 0-2-0 stamp DIRECTOR, All-India Railway Routin Training Institute, Delhi.

అమ్మకము

జిన్నింగు ఫ్యాక్టరి వేలము అమ్మకం

జిన్నింగు ఫ్యాక్టరీ — 10 డబుల్ రోలర్ జిన్సు: యింజన్, బాయిలరు పూర్తిగా లాండ్ షెడ్డుతో 1942 సెప్టెంబరు 20 వ తేదీ వేలము వేయబడును. కావలసినవారు వచ్చి పాట పాడుకొనవచ్చును. శ్రీ కన్యకాపరమేశ్వరి జిన్నింగ్ ఫ్యాక్టరీ గోస్పాడ్, సర్వేల్ తాలూకా, కర్నూలు జిల్లా.

నోటీసు

అమలాపురం సబుకోర్టులో
రిస్యులరు నెం 2 సం 1942 సం॥
వాదులు:—1. పచ్చిగోళ్ల సుబ్బారావుగారు
2. యీ వెంకటేశ్వర్రావుగారు
సా॥ అమలాపురం.
ప్రతివాది:—1. పళ్ల స్వామినాయుడు సా॥ తాణెలంక.

ఈ నెంబరు వాదులు 1 ప్రతివాది పయిన చేసిన దావాలో 1 ప్రతివాది సమక్షమునకు నిమిత్తం యీనెంబరు దావా 22—9—1942 తేదీకి వాయిదా వేసినారు గనుక సదరు దావాలో ప్రతివాదికి ఏమైన ఆక్షేపణలు వున్నయెడల వాయిదారోజు వుదయం 10 గంటలకు స్వయముగాగాని వకీలుగారిద్వారాగాగాని హాజరై కోర్టువారితో మనవిచేసుకోవలెను. అలా జరగనియెడల వాయిదారోజున 1 ప్రతివాదిని యక్పార్టీచేయుదురు. గనుక ఇందు మూలంగా తెలియపర్చడమయినది.

అమలాపురం, 4-9-1942. | మంత్రిప్రగడ బాలకృష్ణమూర్తి, వాదితరపు అడ్వకేటు

E. S. L. C. Public Examination 1943
తెలుగు నోట్సు — ప్రశ్నోత్తరములు
వెల రు 0-14-0
చరిత్ర — భూగోళము — సివిక్సు — లెక్కల ప్రశ్నోత్తరములు
వెల రు 0-14-0

ఈ పుస్తకములు అనుభవజ్ఞులగు విద్యాధికులచే వ్రాయబడి అమ్మకమునకు సిద్ధముగా నున్నవి. గత సంవత్సరపు గవర్నమెంటు పరీక్షాపత్రముల పద్ధతినను సరించి పాఠ్యాంశములు, పరీక్షావిజయముకై తోడ్పడు ప

రామెలు తిరోగమనం

జర్మను సేనలకు పరాభవము

వెండెలువిల్కీ బ్రిటిష్ సైనికుల ప్రశంస

కెయిరో, సెప్టెంబరు 6:—

ఈజిప్టులోని ఎలిమిదవ బ్రిటిషు సైన్యము రామెలు సేనాని యొక్క జర్మను సైన్యమును వెనుకకు తరిమివేసెను, వారంరోజుల క్రిందట జర్మను సేన ఎక్కడనుంచి బయలుదేరి ముందుకు వచ్చినదో తిరిగి అక్కడికే వెనుకకు పోయింది. మొట్టమొదట రామెలు సేనాని తన సేనతో బయలుదేరినప్పుడు నైలునది డెల్టా ప్రాంతంలోనికి చొచ్చుకొని పోవలెనని సంకల్పించాడు. కాని, మిత్రమండలి సేనలు విధి విరామంలేకుండా జర్మనుసేనలను ఒత్తిడిచేసి ఎదురుదాడి చేయుటవల్ల ఆ జర్మనుసేనలు వెనుకకు పోవలసినవయ్యెను. జర్మనుసేనలో ఆఫ్రికా పటాలములు కలవు. 15 వ టాంకు దళమున్నూ 19 వ టాంకుదళమున్నూ కలవు. ఇటాలియను సేనలుకూడా కలవు. రామెలుసేనాని చాలా ప్రబల ప్రయత్నంతోనే దండయాత్రనుసాగించాడు. కాని, మిత్రమండలి సైన్యాలు మొండిపట్టుదలతో ఎదిరించుటవల్లనే జర్మనుసేనలు వెనుకకు తరుమగొట్టబడెను.

నాలుగుపర్యాయములు రామెలుసేనాని 40 జర్మను బాంబువిమానములను 50 పోరాట విమానములను పంపెను. ఆ జర్మను విమానములతో బ్రిటిషు విమానాలు తీవ్రఆకాశ యుద్ధముచేసెను. చిట్టచివరకు బ్రిటిషు విమానాలే గెల్చెను.

జర్మనుసేనలు వెనుకకుతిరిగి పారిపోవునప్పుడు మందుగనులు మాటుపెట్టబడిన ప్రదేశముమీదుగా పోయెను. టాంకులు ఫిరంగులు వెనుకనుంచి బ్రిటిషువారు కాల్చుచుండుటవల్ల మాటుమందుగనులవల్ల జర్మనులకు కలిగే ప్రమాదం మరింత ఎక్కువైనది.

రామెలుసేనానికి నిరుత్సాహము

మూడుదినములక్రిందట జర్మను సేనలు విజృంభించుటకు పూర్వము రామెలుసేనాని తన జర్మనుసైనికులవద్దకువెళ్లి వారికందరికి సిగరెట్టులను తాను స్వయంగా పంచిపెట్టి వారితో మాట్లాడెను. ఆ జర్మనుసైనికులు సిగరెట్టులను కాల్చుకొనుచుండగా, వారితో యిట్లు చెప్పెను. "మనం త్వరలోనే కెయిరో నగరంకూడా దాటి ముందుకు పోగలము" ఈ విధంగా రామెలుసేనాని అన్నాడని బ్రిటిషువారిచే పట్టుకోబడిన జర్మను సైనికుడు చెప్పెను. ఆనాడు జర్మను సైనికులు ఏమకాములో సిగరెట్టులను కాల్చుకొనుచుండిరో తిరిగి వారిప్పుడదుటకే మరలిపోయి చేరినారు.

జర్మను నష్టం

జర్మనులతాలూకు 10వ టాంకుదళమున్ను 21 వ టాంకుదళమున్నూ చాలా నష్టమైనది. జర్మను మోటారుశకట శ్రేణి చాలా ధ్వంసమైనవి.

ఉత్తరరంగం

ఉత్తరరంగంలో బ్రిటిషు గస్తీసేనలు సెప్టెంబరు 4 తేదీ రాత్రి చురుకుగా పని చేయుచునే యుండెను.

బొబ్రూకువై బ్రిటిషు విమానదాడి

గతరాత్రి బ్రిటిషు విమానాలు బొబ్రూకుపై దాడిసలిపి బాంబులు వేసెను. శత్రు విమానాలు యెదిరించి పోరాడెను. కాని, కొన్ని శత్రువిమానాలు చెడగొట్టబడెను.

సెప్టెంబరు 5 తేదీన అమెరికను విమానాలు కొంకియా సముద్రతీరమువద్దనున్న విద్యుచ్ఛక్తి యంత్రాలయములమీద బాంబులుదేసి ధ్వంసంచేసెను. అచటి తెవులలోని నిర్జనములమీదకూడా బాంబులు వేయబడెను.

అలెగ్జాండ్రియావై శత్రువిమానదాడి

లండను, సెప్టెంబరు 6:—

అలెగ్జాండ్రియా రేవుమీదకు వచ్చిన మూడు శత్రువిమానములు బ్రిటిషు విమానములచే శనివారం ఉదయం పడగొట్టబడెను. వాటిలో రెండు సముద్రంలోపడెను. మూడవది ఎడారిలో పడెను.

రామెలుసేనాని దుర్భిక్షము

బ్రిటిషుసేనలు వెనుకటివలెనే పారబడి తన యుద్ధతంత్రపు మోసములో చిక్కుకొనునని రామెలుసేనాని తలంచెను. కాని యిప్పుడు క్రొత్త బ్రిటిషు సైనికాధికారులు కొత్తయూహలతో కొత్త వ్యూహములతో యుద్ధతంత్రం సాగిస్తున్నారు. క్రొత్త యుద్ధాయుధపరికరములతో బ్రిటిషుసేనలు పోరాడుచున్నవి. రామెలుసేనానిసేనలు వెనుకకుపారిపోయినను, తిరిగి ఇంకొకనాడు దండెత్తగలవు అని రూటరు ప్రత్యేకవిలేఖరి వ్రాయుచున్నాడు.

జర్మనులు యీపర్యాయము చాలాకట్టుదిట్టంగా వెనుకకు పారిపోయిరి, కాని, వారి టాంకులు అనేకము నాశనము చేయబడెను.

వెండెలువిల్కీ బ్రిటిషువిజయమును ప్రశంసించుట

అమెరికానుండి యీ జిప్పుకు విచ్చేసిన వెండెలువిల్కీగారు అచటి బ్రిటిషు సేనానియను జనరలు మాంటుగామెరీగారితో ఇట్లుచెప్పిరి. ఇప్పుడు జరిగిన పోరాటంలో చాలా అంతరార్థం, ప్రభావం ఉన్నది.

రామెలుసేనాని యీజిప్టులో యుద్ధము చేయజాలనిస్థితిలో ఉన్నాడు. రామెలును ఆక్షేపించనియెడల, యీజిప్టునంతను ఆక్రమించగలడు. బ్రిటిషుసేనల నడిపించిన మాంటుగామెరీగారు చాలా సేర్పరులు. వీరి సైన్యానికి అమెరికను విమానదళం తోడ్పడుచున్నది అని వెండెలువిల్కీగారు యుద్ధరంగప్రాంతానికి వెళ్లిచూచి అచటి అమెరికను పత్రికావిలేఖరులతోను బ్రిటిషు పత్రికావిలేఖరులతోను చెప్పిరి.

వారు అక్కడ ఉండగానే వారి యెదుటనే బాంబులుపడెను. వారి సమీపంలోనే ఒకశత్రు విమానం పడగొట్టబడెను. ఆ బ్రిటిషు యుద్ధనైపుణ్యం విల్కీగారు చూచి యిట్లనిరి. నేను యిక్కడ యుద్ధభూమిలో ప్రత్యక్షానుభవంగా చూచి గ్రహించిన దానిని అమెరికనులందరూ గ్రహించగలిగితే చాలా బాగుండును. ఇచట బ్రిటిషు సైన్యానికి యింకను యెక్కువ విమానాలు, టాంకులు, ఫిరంగులవున్నట్లయితే ఈ బ్రిటిషు సాధింపరానిదేది! మధ్యప్రాచ్యము చాలా ప్రధానమైన యుద్ధరంగము. దీని ప్రాధాన్యమును అమెరికనులు గ్రహించారని నాకు తోచదు. ఇచటిసైనికులు మంచి పరాక్రమంతో ఉన్నారు.

అలెగ్జాండ్రియా, సెప్టెంబరు 6:—

మధ్యప్రాచ్య బ్రిటిష్ సేనలకు సర్వసేనానియగు సర్. హెన్రీ హార్వుడ్డుగారిని అలెగ్జాండ్రియాలో ఆదివారంనాడు కలిసికొని వెండెలువిల్కీగారు మాట్లాడిరి. మన బ్రిటిష్ సేనలు యీ రామెలును నిరోధించగలవు, అని వెండెలువిల్కీగారన్నారు.



మీ చేతిరుమాలను ముడివేసి పీక్ ఫ్రీన్స్ గ్లాక్సో బిస్కట్లను జ్ఞాపకముంచుకొనుడు. మీరు విడిదిలైన ప్రస్తుత పరిస్థితుల మూలముగా, ఇండియాకు ఈ పేరొందిన ఇంగ్లీషు బిస్కట్లు సరఫరా చేయుటకు వీలు కాకుండయున్నది. కాని విజయము ప్రాప్తించినప్పుడు — గ్లాక్సో బిస్కట్లు తిరిగి దుకాణములలోను, బజార్లలోను దొరకును. అంతదనుక — జ్ఞాపకముంచుకొనుడు —

PEEK FREAN Glaxo BISCUITS

పీక్ ఫ్రీన్ గ్లాక్సో బిస్కట్లు-ఇండియాకు తిరిగివచ్చును.

ఆంధ్రదేశ వార్తలు

కాకినాడ

సెప్టెంబరు 1:— తూర్పు గోదావరిజిల్లా కలెక్టరు శ్రీ టి. భాస్కరరావు నాయుడుగారు ఆదివారము సాయంకాలము జగన్నాథపురం వంతెనవద్ద బహిరంగసభలో కూలిపనివారల కష్టాలను విని, నగరములో చాలచోట్ల చౌకగా బియ్యము అమ్మేకొట్లు చిల్లరగా కిరసనాయిలు అమ్మకపు డిపోలు పెట్టించెదమని వాగ్దాన మొసంగిరి. (స్వ. వి.)

అనంతపురం

సెప్టెంబరు 1:—అనంతపురం మునిసిపల్ కౌన్సిలువారు 31-8-42 తేది సమావేశమై మునిసిపల్ హైస్కూలులో చదువు హరిజనవిద్యార్థులనుండి జీతము వసూలు చేయకుండ విద్యగరపుటకు తీర్మానించిరి.

ఈజిల్లా కలెక్టరుగనుండిన శ్రీ ఇ. జెన్నెటుగారు విశాఖపట్టణం జిల్లాకు మార్చబడుటచే వారికి బదులుగా శ్రీ టి. ఎస్. రామచంద్రన్ ఐ. సి. ఎస్. గారు కలెక్టరుగా వచ్చియున్నారు. (స్వ. వి.)

గుంటూరు

ఆగస్టు 31:— ఆంధ్ర విశ్వవిద్యాలయ హాస్టలు సారస్వతపంఘువారు 29 వ తేదీ ప్రత్యేకసమావేశమందు శ్రీయుత మహాదేవ దేశాయిగారి అకాల మరణమునకు తమ హృదయపూర్వక సంతాపమును వెలిబుచ్చుచు, తమ సానుభూతిని మహాదేవదేశాయిగారి కుటుంబమునకు తెలియబరిచిరి. (స్వ. వి.)

చెన్నూరు

సెప్టెంబరు 1:—గూడూరు తాలూకా చెన్నూరు గ్రామప్రాథమిక యువజనసంఘ సభ్యులు కామ్రేడ్ బి. శంకరయ్యగారి అధ్యక్షతను 29-8-42 న సమావేశమై రాబోవుసంవత్సరమునకు పి. వెంకటసుబ్బయ్యగారిని అధ్యక్షుడుగను, పి. సుబ్బరామయ్య, పి. రాఘవయ్యగార్లను కార్యదర్శులుగను, యె. యల్. శివయ్య, డి. పెంచలయ్య, యస్. జాఫర్ సాహెబు, పి. మిర్జాఖాన్ గార్లను కమిటీ సభ్యులుగను యెన్నుకొనిరి. (స్వ. వి.)

తిరుపతి

సెప్టెంబరు 1:—ఆదివారం రాత్రి 12 ఘంటలప్పుడు తిరుపతి కొండమీద ఆకస్మాత్తుగా నిప్పంటుకొన్నందున సుమారు 60 గుడిసెలు భస్మమైనవి. అయిదు ఎనములున్నూ చనిపోయినవి.

నేటి వుదయం ఒక యుపాకుడు అంబాళ నుంటలో యుండు చెట్టునుండి వ్రేలాడబడుచున్నాడు. ఈ నగరవాసి కాడు. (స్వ.వి.)

పార్వతీపురం

సెప్టెంబరు 1:—29-8-42 తేదీ శనివారం సాయంకాలము 7 గంటలకు శ్రీ బరాటం చిన్న సత్యనారాయణగారి అధ్యక్షతక్రిందను భారతీ పవనమందిరము స్థాపింపబడెను. శ్రీ చక్కా సత్యనారాయణగారు అధ్యక్షుడుగాను, శ్రీ ద్విపేదుల సంగమేశ్వరరావు, వారణాశి సుందరనారాయణగార్లు కార్యదర్శులుగాను ఎన్నుకొనబడిరి. (జ. వి.)

మదనపల్లి

మదనపల్లి, సెప్టెంబర్ 1:—

నిన్న ప్రెసిడెంటు శ్రీ దస్తగిరి సాహెబుగారి అధ్యక్షతను జరిగిన మదనపల్లి పంచాయతీ బోర్డు సభ్యుల సమావేశమందు, మహాదేవదేశాయిగారి మృతికి తమ విచారమును తెలుపుచును, దేశనాయకులను నిర్బంధించుటలో ప్రభుత్వమువారిచర్యలను నిరసించుచును తీర్మానింపబడెను. నిరసన సూచకముగ సమావేశముయొక్క కార్యక్రమమును పదినిమిషములు ఆపివేసిరి.

మదనపల్లి న్యాయవాది సంఘమువారు శ్రీ సి. రామారెడ్డిగారి అధ్యక్షతను సమావేశమై మహాదేవదేశాయిగారి మృతికి తమ సానుభూతిని తెల్పుచును, ప్రభుత్వము యొక్క దమననీతిని నిరసించుచును, శ్రీ నూతి రాధాకృష్ణయ్యగారిపై చేసిన లాఠీచార్జికి అసమ్మతిని సూచించుచును తీర్మానములను ఆమోదించిరి. (స్వ. వి.)

ఒంగోలు

ఒంగోలు, సెప్టెంబరు 3:—

ఈ పూరి వర్తకులలో దేవాలయ, ధర్మసత్రముల నిర్మించి పేరుప్రఖ్యాతులు గడించిన శ్రీ తాతా కన్నయ్యగారి మనుమలును, లేటు చినవెంకటసుబ్బయ్యశ్రేష్ఠిగారి ద్వితీయ కుమారుడు చిరంజీవి లక్ష్మీనరసింహస్వామికి యీ వూరి మున్సిపల్ కౌన్సిలర్ శ్రీ శిఖాకొల్లి హనుమంతరావు శ్రేష్ఠిగారి కుమార్తె సౌభాగ్యవతి అన్నపూర్ణమ్మను యిచ్చి వివాహము అత్యంతవైభవముగ జరిగినది. వేలకొలది బీదలకు అన్నదానము జరిపిరి. స్థానిక ఆర్యవైశ్యగ్రంథాలయమునకు ఉభయపార్టీలవారు కలసి నూటపదహారు రూప్యములు విరాళ మొసంగిరి. (స్వ. వి.)

కడప మునిసిపలు మీటింగు

("ఆంధ్రపత్రిక" విలేఖరి)

కడప, సెప్టెంబరు 2:—

మొన్నటిదినము రావుసాహెబ్ శ్రీ పి. శేషయ్యశెట్టిగారి అధ్యక్షతక్రింద కూడిన మునిసిపల్ ప్రత్యేకసమావేశములో ప్రసూతి, శిశుసంరక్షణ కేంద్రమునకు సంబంధించిన మునిసిపల్ మంత్రసాని శ్రీమతి హెచ్. ఆర్. సామ్యూయల్ పతిగారిని ఆరోగ్యశాఖ డైరెక్టరుగారు ఆకస్మికముగా మార్చినందులకు అసమ్మతి తెలుపుచూ ఒక తీర్మానము ఆమోదింపబడెను. ఇందు విషయమై జరిగిన ఉత్తరప్రత్యుత్తరములను కమిషనర్ గారును, మునిసిపల్ హెల్త్ఆఫీసరుగారును కౌన్సిలువారి ఎదుట పెట్టనందులకు అసమ్మతిని, ఆక్షేపణలను తెలుపుచూ మరియొక తీర్మానము ఆమోదింపబడెను. వైస్ చేర్మెన్ గారైన మిస్టర్ సయ్యద్ అహమ్మద్ సాహెబ్ గారును, మరి నలుగురు కౌన్సిలర్లును ఈ తీర్మానములను అంగీకరింపలేదు.

మునిసిపల్ సాధారణ సమావేశములో, కడప కుష్ఠురోగనివారణ సంఘమునకు రు 200/- విరాళము మంజూరుచేయబడెను. పెన్నారు నీటిసప్లయి పైపు యంత్రము సరిగా పనిచేయనందున బుగ్గ నీటిసప్లయి మరి నాలుగునెలలు పనిచేయుటకు కౌన్సిలువారు ఆమోదించిరి.

తెనాలి చర్కాసంఘములోని దొంగతనము

ముద్దాయిలకు శిక్షలు

తెనాలి, సెప్టెంబరు 2:—

తెనాలి చర్కాసంఘములో లోగడ ఖద్దరు వస్త్రములను దొంగలించిన నేరమునకై తెనాలి డిప్యూటీ కలెక్టరుగారగు పి. శివశంకరం పిళ్లెగారు పిల్లి కనకాంబరం అను వానికి 9 మాసములును, ముల్లా మొహిద్దీన్ సాహెబునకు 6 మాసములును, కేసాని సూర్యనారాయణకు 6 మాసములును కఠినశిక్ష విధించుచు తీర్పుజెప్పిరి. పైవారినందరిని రాజమండ్రి జైలునకు బంపిరి. (స్వ. వి.)

శ్రీ శిల్పపంచానన అరశవల్లి భీమలింగాచారి నిర్యాణము

తెనాలి, సెప్టెంబరు 2:—

తెనాలిలో సుప్రసిద్ధ విశ్వబ్రాహ్మణ కుటుంబమునకు చెంది అన్నివిధములగు శిల్ప విద్యలలో ఆరితేరిన పాండిత్యమును గడించి పెక్కుమందిచే పెక్కుబిరుదముల నందిన శ్రీ శిల్పపంచానన అరశవల్లి భీమలింగాచార్యులుగారు 31-8-42 తేదీన తమ స్వగృహమున కాలధర్మము నందినరని వ్రాయుటకు విచారించుచున్నాము. వీరి గౌరవార్థమై తెనాలి పురాబుబజారు, తదితర శిల్పిదుకాణములు అన్నియు మూయబడినవి. వారి మృతకళేబరమును చలువనప్పరముపైనుంచి పేళితాళములతో వుత్సవము గావించుచు షుమారు 400 మంది బంధుమిత్రులు వెంటరాశ్మశానమునకు గొంపోబడెను. వీరికి 1 పుత్రుడు, 4 పుత్రికలు గలరు. వీరిమృతి వలన శిల్పవిద్యకు తీరని కొరత గలిగినది. (స్వ. వి.)

గుంటూరు హోలు సేలు కో-ఆపరేటివు స్టోర్సు

సెప్టెంబరు 2:—నిన్న సాయంకాలము గుంటూరు హోలుసేలు సహకారకొట్టు ప్రారంభోత్సవము జిల్లాకలెక్టరు శ్రీయుత పి. యేం. మీనన్ ఐ. సి. యస్. గారు జరిపిరి. మేరు సర్టిఫికెట్లు జిల్లాకలెక్టరుగారి సతీమణి పద్మినీ అచ్యుత మీనన్ గారు యిచ్చివేసిరి. ఈ సమావేశమునకు శ్రీయుత జాగర్లమూడి కుప్పస్వామిచౌదరి (మాజీ గుంటూరుజిల్లాబోర్డు అధ్యక్షులు) అధ్యక్షతవహించిరి. గుంటూరు పౌరులు చాలా మంది సభకు విచ్చేసియుండిరి. స్టీవర్టు దొరగారు ఐ. సి. యస్. కూడ విచ్చేసియుండిరి.

తేనీటివిందు, ఫోటో, అయిన తరువాత సమావేశము ప్రార్థనతో మొదలిడెను. శ్రీయుత జె. కుప్పస్వామిచౌదరిగారు అధ్యక్షతవహించిరి.

ఈ స్టోర్సుకు అధ్యక్షులైన రా॥ బి॥ తెల్లాకుల జాలయ్యగారు తమ నివేదికను చదివిరి.

జాగర్లమూడి కుప్పస్వామి చౌదంగారు ఈ సహకారసంస్థకు సర్వవిధముల సహాయము చేయవలెనని కోరిరి.

శ్రీయుత యస్. నీలకంఠము,(డెప్యుటి రిజిస్ట్రారు) డాక్టరు సి. ఆర్. రెడ్డి (వైస్ ఛాన్సలరు) కే. శ్రీనివాసన్ ఐ. సి. యస్. (జిల్లాజడ్జి) పంపిన సందేశములు చదివి వినిపించిరి. (స్వ. వి.)

పెనుకొండ

పెనుకొండ, సెప్టెంబరు 2:—

స్థానికబోర్డు హైస్కూలు ప్రధానోపాధ్యాయులు గానున్న శ్రీ పి. రాఘవేంద్రాచార్యులవారిని, ఉరవకొండ బోర్డు హైస్కూలుకు మార్చినారు. వీరి స్థానమునకు ధర్మవరంబోర్డు హైస్కూలు హెడ్ మాష్టరు శ్రీ కె. సి. శేషన్ గారిని వేసినారు. (స్వ. వి.)

అంతర్జాతీయ యువజనసమావేశము

యుద్ధమునకై తీవ్రముగా కృషిచేయుటకు వాగ్దానము

లండన్, సెప్టెంబరు 6:—

నేడు లండనులో జరిగిన అంతర్జాతీయ యువజన సమావేశమునకు అన్నిదేశముల నుండియు 6 వేలమంది ప్రతినిధులు వచ్చిరి. కమ్యూనిస్టు లీగువారేర్పరిచిన 40 సమావేశములలో నిదిముఖ్యమైనది. సభలో నుపన్యసించినవారిలో నొక జర్మనుండెను. ఈతని పేరు హెల్మెటు ఈతనితండ్రిజర్మనురీచ్ స్టాగుసభ్యుడుగా నుండెను. నాజీ లాతని హత్యచేసిరి. ఫాసిజమునకు వ్యతిరేకంగా యుద్ధకులు చేయుచున్న పోరాటమునకు చిహ్నముగా సభవారుస్వాతంత్ర్య కాగడాను వెలిగించుట ఈసభలో విశేషము.

సంపూర్ణ విజయము, స్వాతంత్ర్యము లభించువరకు యుద్ధ ప్రయత్నములకు బాగుగా తోడ్పడుటకు యువకులను బ్రిటిషు కార్మికులు వాగ్దానము గావించిరి.

సోవియటు రాయబారి సందేశము

సభకు సోవియటు రాయబారి మెయిస్కీగారు ఈక్రింది సందేశము పంపిరి:—

ఇంతవరకు నాజీ జర్మనీ నెదుర్కొను భారము ముఖ్యముగా రష్యాపైబడి యుండెను. ఇకముందు ఈ భారమును మిత్రమండలివారు గూడ సమానముగా పంచుకొందురని మేము, ఆశించుచున్నాము?

భారతదేశముతో రాయబారములు జరుపుడు

డెయిలీవర్కరు ఆశయము

ప్రచురింపబడుచున్న కమ్యూనిస్టు పత్రిక

లండన్, సెప్టెంబరు 6:—

డిఫెన్సు రెగ్యులేషన్సు ననుసరించి 19 నెలల క్రింద ఆగిపోయిన కమ్యూనిస్టు పత్రిక డెయిలీవర్కరు రేపు మరల ప్రచురింపబడుచున్నది. హిట్లరును నాశము చేయుటకు సంపూర్ణముగా తోడ్పడెద మని పత్రికా సంపాదకబోర్డువారు వాగ్దానము గావించిరి. ఈ పత్రిక ఆశయములు మూడు. (1) ఐరోపాలో రెండవరంగము నేర్పరిచి, ఈ రంగమునకు ఆయుధములు పంపునట్లు చేయుట (2) మిత్రమండలివారిలో సఖ్యభావము వృద్ధిచేయుట (3) భారతదేశముతో రాయబారములు జరుపుట. యుద్ధమునందు తోడ్పడగల జాతీయ ప్రభుత్వము నేర్పరుచుట. ఈ జాతీయ ప్రభుత్వములో అన్ని వర్గములప్రతినిధు లుండునట్లు చూచుట.

కుష్టు, బొల్లి వగైరా

మేహము చర్మము, సెగ, సవాయి వ్యాధులకు గ్యారంటీ చికిత్స. క్యాటలాగు ఉచితము. జి. వి. రెడ్డి, ప్రొప్రయిటరు, బి. రెడ్డి & కో, (రిజిస్టర్డు) గోపాలపురం, తూర్పుగో॥ జిల్లా.

SEX FREE BOOK! "Standard Health" gives you sensational information on sex and other topics of vital interest to you. GREENFIELDS LIMITED SRINAGAR-KASHMIR.

యూనియన్ లైఫ్

అస్యూరెన్సు కంపెనీ, లిమిటెడ్,

బొంబాయి.

శ్రీ శ్రీ శ్రీ మహారాజ జాం సాహెబ్ బహాదూరువారి ఆదరణాభిమానముక్రింద నున్నది

రాజులకు, ప్రజలకు ఉపయోగపడు కంపెనీ

ద్వితీయ వార్షిక నివేదికయందలి సారాంశము

మూలధనము:	చందా వేయబడినది	రూ. 5,46,292
	చెల్లించినది	రూ. 2,79,082
వ్యాపారము:	చేసినది	రూ. 33,05,100
	జారీచేసిన పాలసీలు	రూ. 26,27,000
ప్రీమియం	వసూలైనది	రూ. 1,75,654-8
పాలసీ 1-కి సగటున ఛీమాచేసిన మొత్తం		రూ. 3,300
జీవితఫండులో అభివృద్ధి		రూ. 145% పైగా
క్లెయిము		రూ. 1,000 మాత్రమే

రెండవసంవత్సరములోనే యీకంపెనీ యింత గొప్పగా అభివృద్ధిపొందుటకు సాయపడినవారందరికిని కంపెనీ డైరెక్టర్లను, మేనేజిమెంటువారును వందనము లర్పించుచు భారతీయుల వల్ల "యూనియన్ లైఫ్" యింతవరకు పొందిన ప్రోత్సాహము నిరంతరము కొనసాగుగాక యని కోరుచున్నారు.

హెడ్డాఫీసు:—పోర్టు, బొంబాయి.

ఇతర ఆఫీసులు:—కలకత్తా, అహమ్మదాబాదు, రాజకోట, బరోడా, సూరత్, కరాచీ, కొల్హాపూరు, ధార్వారు, పోర్ బందర్, జామనగర్, నాగపూర్, అమ్రోటీ, లాహోరు, జాంజిబారు, కొలంబో, సైరోబి.

మేనేజింగు డైరెక్టరు: జే. ఎం. అఖాని గారు.

UNION IS STRENGTH

మద్రాసురాజధానికి, మద్రాసులో ఒక బ్రాంచిని స్థాపింపవలెనని పరిపాలకవర్గమువారు తీవ్రముగా ఆలోచించుచున్నారు. ఈ వ్యాపారములో అనుభవము గలవారు, దినదినాభివృద్ధిగాంచుచున్న యీసంస్థలో చేర నుద్దేశమున్నచో వెంటనే హెడ్డాఫీసునకు వ్రాసుకొనవలెను.



Keep AWAY THOSE Germs
కేరళ
COAL TAR SOAP
CARBOLIC
KERALA SOAP INSTITUTE, CALICUT.

కేరళ కోల్‌టార్ సోప్
వ్యాధి క్రిములను సంహరించును

మానవ ఆరోగ్యము, బలము, పటుత్వము వాటర్‌బరీస్ కలవు చేకూరును.
ఇట్టి అనుభవమున ఆరోగ్యమైన శరీరము, ధారాళమైన తేజస్సు కిమిపిల్లలకు వాటర్‌బరీస్ కాంపౌండు యిచ్చెదరు. వాటర్‌బరీస్ కాంపౌండు వాడుకొనుచుండి వారులోగ ఉన్నది ఆరోగ్యము, బలము, మానిన ఉత్సాహ మెరుగు లను రోధించును. శరీరమున అనుభూతిని పదార్థము లిందు ఏర్పడుటకు వస్తాయి. ఇందు విరిగ్, మూత్రపిండాలు, లోపాము, శ్వాసము మొదలగు ఆరోగ్యమునకు అవసరమగు పదార్థములు గలవు.
వాటర్‌బరీస్ కాంపౌండు పిల్లలకు మరియు పెద్దలకు సమానమైనది. పెద్దలు దీని పిల్లలకు రెట్టి పడెదము. తిత్తి ఒక సీసాలు శాస్త్రము. కొంత పైకాలు.
8 ఔ॥ 16 ఔ॥ సీసాలు.
WATERBURY'S Compound
వాటర్‌బరీస్ కాంపౌండు
దేహదార్ఢ్యమునకు

MENSO
మెన్‌సో ఎంతకాలమునుండి బహిష్టు కాకుండినను సరే, దక్కువదనము. రు 2. లిబ్జ్-సుఖదాయక మైన నంతానోత్పత్తి హామీ. రూ 2. Dr.C. Bhattacharjee H.M.D. 40 యేండ్ల అనుభవము
264, Dasaswamedh Rd., Benares. City.

వసంతకుసుమాకరము
రసాయనము ప్రమేహరోగములకుమంచిది
తు 1 కి రూ 80.
ఆర్యరసాయనశాల, ముక్త్యాల

డా॥ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి
బెజవాడ (లేక) రాజమండ్రి
వారి ఔషధములను, గ్రంథములను, అనుభూత ఔషధములను, లోకప్రసిద్ధములు. కావలసినవారు వారికి వ్రాసి తెప్పించుకొనవచ్చును. మరియు వారి స్టాకిస్టుల అదరిగద్ద కూడ లభింపగలవు.

ఘనసార చందిని
శరీరోగమునకు వజ్రాయుధము. ఎరుపు, తెలుపు, పసిమి మొదలగు అంటు శరీరోగములను స్త్రీల కుసుమవ్యాధులను ఖండించును. సీసా 1-కి రు. 1-4-0 పోస్టేజి. ప్రత్యేకం. అనుపానమునకు చందిని అత్తరు సీసా రు 0-8 0
పి. శి. ఏ. అండు కంపెని,
ఆయుర్వేదసమాజం పెరిదేపి, నెల్లూరుజిల్లా.
నెం. 8.

—: విలాసమార్పు :—
పి. వి. రాజన్ & కంపెనీ,
మదరాసు నస్యం & R. S. సుగంధ ముక్కుపొడి
తయారు చేయువారు
నెం. 10, అరుణాచలరెడ్డి వీధి,
అరక్కోణం N. A. Dt.
ఈ విలాసమునకు బాబు వ్రాయులకు కోరుచున్నాము.

నిర్బంధవిధాన నిరసన

(:)

చిత్తూరు జిల్లాబోర్డు తీర్మానము

ఆంధ్రదేశమున అరెస్టులు శిక్షలు

(మా విలేఖరులవద్దనుండి)

చిత్తూరు, సెప్టెంబరు 6:— నిన్నటిదినము బోర్డు అధ్యక్షులు, టి. ఎన్. రామకృష్ణారెడ్డి ఎం. ఎల్. ఏ. గారి యాజమాన్యమున చిత్తూరుజిల్లాబోర్డు సాధారణసమావేశము జరిగినది. బోర్డు సభ్యులెల్లరు సభలో హాజరైయుండిరి.

ప్రథమమున, సాధారణ విషయములు చర్చింపబడి తీర్మానింపబడినవి.

ప్రకృతము ప్రభుత్వమువారు అవలంబించియుండు నిర్బంధవిధానము (అనగా అరెస్టులు, శిక్షలు మున్నగునవి) గూర్చి బోర్డువారు తమ నిరసనమును తెలుపుచు నిందులకై తమ యాసమ్మతిని వెల్లడిచేయుటకై బోర్డుకు సంబంధించిన సంస్థలు, బోర్డు ఆఫీసు, పాఠశాలలు మున్నగువాటిని ఒక దినము (రేపటిరోజు) మూసివేయించవలెనని యేకగ్రీవముగా తీర్మానించిరి.

కడప జిల్లాబోర్డు

సెప్టెంబరు 5.—నేడు కడప జిల్లాబోర్డు అవసరసమావేశములో సభా కార్యక్రమము ప్రారంభమగుటకు పూర్వము శ్రీ॥ శ్రీ॥ మహాదేవదేశాయిగారి అకాల మరణమునకు సానుభూతి వెలిబుచ్చుచూ బోర్డు సభ్యులు అందరు లేచినిలుచుకొని ఒకతీర్మానమును ఆమోదించి, వారి గౌరవార్థము బోర్డు మీటింగును 15 నిమిషములు ఆపుదలచేసిరి. తరువాత బొంబాయితీర్మానము నామోదించిరి.

ప్రభుత్వ నిర్బంధవిధానమున కసమ్మతి తెల్పుచును తత్సూచకముగా రాబోవు గురువారము 10 తేది జిల్లాబోర్డు కార్యాలయము, జిల్లాబోర్డు పరిపాలనలో నుండు ఇతర కార్యాలయములు, జిల్లాలో జిల్లా బోర్డు పాలనక్రిందనుండు పాఠశాలలు అన్నిటిని మూయవలెనని యు తీర్మానించిరి.

తీర్మానముల రద్దు

కడప, సెప్టెంబరు 6:— మొన్న శుక్రవారము అవసర సమావేశములో కడపజిల్లా బోర్డువారు అఖిలభారత కాంగ్రెసుసంఘ సభవారు బొంబాయిలో గావించిన తీర్మానమును ఆమోదించుచూ గావించిన తీర్మానమునున్న, జాతీయనాయకుల నిర్బంధమునుగూర్చియు, ప్రభుత్వము వారి నిర్బంధ విధానమునకు విముఖత్వము తెలుపుటకై రాబోవు గురువారము 10 తేది జిల్లాబోర్డు కార్యాలయమును; జిల్లాబోర్డు పరిపాలనకు లోనైన ఇతరకార్యాలయములను, జిల్లాలో యందు జిల్లాబోర్డు పాఠశాలలను మూయవలెనని గావించిన తీర్మానములను కడప జిల్లా కలెక్టరుగారైన శ్రీ యస్. రంగనాథన్, ఐ. సి. యస్ గారు ఇండియారక్షణ చట్టము 38 (3) సెక్షన్‌క్రింద రద్దుచేయుచు నిన్నటిదినము ఉత్తరువుచేసిరి. ఈ ఉత్తరువు కడపజిల్లాబోర్డు ప్రసిడెంటు గారికిని, ఇతర జిల్లాబోర్డు క్రింద నుండు ఉద్యోగులకును పంపబడెను:—

కడప తాలూకా అలంఖానాపల్లెపుచేరిన శ్రీయుతులు యస్. వరదారెడ్డి, యస్. పెద్దసుబ్బారెడ్డి బి. పెద్దిరెడ్డి అనువారలు ఈదినం సాయింకాలము అరెస్టుచేయబడిరి.

నేతి వేంకటచలపతి రావుగారి అరెస్టు

గుంటూరు, సెప్టెంబరు 7:— గుంటూరులో శారదానికేతనము సమష్టి కార్యదర్శియున్న, గుంటూరు కాంగ్రెసు నాయకులలో వకరున్న అయిన నేతి వేంకటచలపతి రావుగారిని పోలీసువారు నిన్న ను శేఖరమణ చట్టంకింద అరెస్టుచేసి గుంటూరు సబుజయిలులో వుంచిరి. వీరియింటిని సోదాచేశారు. గాని సేరమునకు ఆధారము లైనవేవీ దొరకలేదు. (స్వ. వి.)

రాజమండ్రి

సెప్టెంబరు 5:— శ్రీ సూరంపూడి శ్రీ హరిరావుగారిపై నేడు నిన్న రాజమండ్రి బాయింటు మేజస్ట్రేటు గారు విచారించి డిఫెన్సు ఆఫ్ ఇండియా రూల్సు క్రింద 1 సం॥ కఠినశిక్ష విధించిరి.

నిడుబ్రోలు

సెప్టెంబరు 4:—పాపన వెంకటేశ్వర్లును పొన్నూరు పోలీసువారు ఐ. పి. సి. 147, 149, 427, 436 సెక్షన్‌ల క్రింద రయిల్వే స్టేషను తగులబెట్టిన నేరముక్రింద అరెస్టు చేసి పొన్నూరు సబ్ జైలులో వుంచిరి.

కాకినాడ

సెప్టెంబరు 5:— మద్రాసు ప్రభుత్వముచే అక్రమసంఘముగా ప్రకటింపబడిన మార్పు గోదావరి జిల్లాకాంగ్రెసుసంఘ కార్యాలయమున్న యిల్లు కాకినాడలో యీరోజు ఉదయమున పోలీసువారు స్వాధీనము చేసికొని తాళములనేసి సీళ్లు విగించిరి.

పొన్నూరు

సెప్టెంబరు 5:— మొన్న సాయంత్రము పాపన వేంకటేశ్వర్లు అనే ఈవూరు నివాసిని పోలీసువారు అరెస్టుచేసినారు. ఈరోజు మధ్యాహ్నం అల్ల పిరయ్య అనే వారిని అరెస్టు చేసినారు. వీరిద్దరిని క్రిమినల్ ప్రొసీజర్ కోడు 127, 149, 427, 436 క్రిందనూ, రైల్వేయాక్టు 126 క్రిందనూ, డిఫెన్సు ఆఫ్ ఇండియా రూల్సు 35 ప్రకారమున్ను అరెస్టుచేసినట్లు తెలియుచున్నది.

నూజివీడు

సెప్టెంబరు, 5:-నూజివీడు సబుడివిజనల్ మేజస్ట్రేటు శ్రీ పి. వి. మాధవరావుపంతులు బి. ఏ. గారు, నిన్న శ్రీ క్రోసూరి నరసింహమూర్తిగారిపై డిఫెన్సు ఆఫ్ క్రింద మోపబడిన కేసువిచారించి రెండు సంవత్సరములు కఠినశిక్ష విధించిరి. నేడు శ్రీ దళకసూర్యప్రకాశరావుగారిపై డిఫెన్సు ఆఫ్ క్రింద మోపబడిన కేసువిచారించి 15 మాసములు శిక్షవిధించి బి. క్లాసు నొసంగిరి.

నరసాపురం

సెప్టెంబరు 5:— మొన్నటిదినమున జాయింటు మేజస్ట్రేటు శ్రీయుత పి. ఎస్. నాయక్ ఐ. సి. యస్ గారు విచారణచేసి శ్రీయుతులు ఆకెళ్ల గోపాలకృష్ణశర్మ తంగిరాల కృష్ణానంద టిలక్ గార్లకు డిఫెన్సు ఆఫ్ క్రింద చెరియారుమాసములు కఠినశిక్ష విధించి యిద్దరికి సి క్లాసు నిచ్చిరి.

పాలకొల్లు

(స్వకీయవిలేఖిరి)

పాలకొల్లు, సెప్టెంబరు 3:— ఇచట మునిసిపలు అధ్యక్షులగు అద్దేపల్లి సత్యనారాయణగారిని అరెస్టు చేసినందుకు హైస్కూలు విద్యార్థులు కొందరు సమ్మె చేసిరి. నిన్న ఉదయం స్కూలువద్ద పికెటింగు జరుగుచుండగా పోలీసువారు స్థానికగార్డులు వచ్చి పికెటింగు చేయుచున్న విద్యార్థులను కొట్టి మోటారులోవేసి స్టేషనుకు తీసుకపోయి లాకపులోనుంచిరి. తరువాత, పోలీసు మోటారు వీధులలో తిరిగి మరికొందరు విద్యార్థులను, ఇతరులను కొందరిని కూడ కొట్టి అరెస్టుచేసి లాకపులో నుంచినట్లు తెలియుచున్నది.

శ్రీకాకుళం

సెప్టెంబరు 2:— మొన్నటి ఆదివారం నాడు సాయంకాలం శ్రీకాకుళంలోని హైస్కూలు విద్యార్థులు యితరులు కాంగ్రెసు నాయకులు వర్గము పడుచున్నను షూమారు 4, 5 వందలవరకు ఊరేగింపు జరిపి సాయంకాలం సభజరిపిరి.

శ్రీకాకుళం మున్సిపల్ హైస్కూలు యందుట స్థానిక కాంగ్రెసు సేవకులు శ్రీయుతులు ఓలేటి నర్సింహస్వామిపంతులు, నర్సింహం అను యువకుడు శాంతియుతంగ మొన్నటి దినమున పికెటింగు చేసిరి.

విశాఖపట్నం

విశాఖపట్నం, సెప్టెంబరు 1:— ఆగస్టు 29 వ తేదీ శనివారం ఆంధ్రపత్రికలో "విశాఖపట్నం జిల్లాబోర్డు" అనే శీర్షికక్రింద తెలుపబడిన వార్తలలో "మహాదేవ దేశాయిగారి మరణమునకు సంతాప సూచకముగ బోర్డు కార్యాలయములను, పాఠశాలలను సెప్టెంబరు 7 వ తేదీని మూయుటకు బోర్డు సమావేశంలో తీర్మానించబడినట్లు తెలుపబడిన సంగతి పొరబాటు. పాఠకులు పై పొరబాటును ఇట్లు సవరించుకొనగోరుచున్నాను:

మహాదేవ దేశాయిగారి నిర్యాణమునకు సంతాప సూచకముగ బోర్డు పరిపాలన క్రిందనున్న అన్ని కార్యాలయములలోని ఉద్యోగులున్నూ, పాఠశాలలందలి ఉపాధ్యాయులను తొలిసారి సమావేశంకాగానే ఒక కేంద్రస్థలమునచేరి అయిదు నిమిషముల కాలము మౌన మవలంబించవలెనని ఆజ్ఞాపించుటకు తీర్మానించబడెను.

అంతేకాని పాఠశాలలుకాని, కార్యాలయములుకాని సెప్టెంబరు 7 వ తేదీని మూయవలెనని తీర్మానించబడలేదు.

ఆగస్టు 12 వ తేదీని స్థానిక పురపాలక సంఘాధ్యక్షులగు శ్రీయుతు. పట్టాభిరామిరెడ్డిగారు తమ అగ్రక్షుపదవికి యిచ్చిన రాజీనామాను 30-8-42 వ తేదీని ఉపసంహరించుకొనిరి. కాంగ్రెస్ సభ్యత్వమునకు ఇచ్చిన రాజీనామాను ఉపసంహరించుకొన్నదీ, లేనిదీ యింకను తెలియకున్నది. (స్వ. వి.)

విషాదవార్త

వరంగల్, సెప్టెంబర్ 3:— సుప్రసిద్ధ వైణికులు శ్రీయులగు శివానంద శాస్త్రిగారి ధర్మపత్ని రాజేశ్వరమ్మగారు టైఫాయిడ్ జ్వరంవల్ల ఆగస్టు 31 వ తేదినాడు ఈ యూరనున్న విమల దవాఖానాలో శివసాయుజ్యము పొందిరి. (ఒ. వి.)

బొంబాయిలో అల్లరులు

(*)

మూడుప్రదేశాలలో పోలీసు కాల్పులు- కర్ఫ్యూ ఉత్తరువు

ఇతరరాష్ట్రి పరిస్థితులు

బొంబయి, సెప్టెంబరు 6:— ఈ సాయంత్రం పట్టణ దక్షిణభాగంలో కాంగ్రెసువారులు ఊరేగింపు జరపాలని ప్రయత్నం చేయటంతో మళ్లీ అల్లరిప్రారంభమైనది. మూడుచోట్ల పోలీసువారు తుపాకుల కాల్చవలసివచ్చెను. అందువల్ల యిద్దరికి గాయములు తగిలినవి. పన్నెండుమందిని అరెస్టుచేసిరి. వారిలో ఆర్గురు స్త్రీలు. ఊరేగింపు చెదరగొట్టటానికిలాఠీచార్జి చేసిరి. అందువల్ల 12 మందికి గాయములు తగిలెను.

ఊరేగింపును చెదరగొట్టిన తరువాత అదర్శర ప్రాంతాలలో గుంపులుచేరి ట్రాములను బస్సులనుఆపి రాళ్లు వేసిరి. ఒకబస్సును తగులబెట్ట ప్రయత్నించిరి. పోలీసువారువచ్చి తుపాకులనుకాల్చి గుంపులను చెదరగొట్టిరి. ఈ అల్లరులు కల్బదేవి, భూలేశ్వరు, తాహూరుద్వార్ ప్రదేశాలలో మాత్రం జరిగెను. పోలీసువారు జంక్షన్లదగ్గర ప్రజలుచేరి రాకపోకల కడ్డు కలుగజేస్తున్నందువలన చిమ్మచీకటిగ చెదరగొట్టిరి. ఈఅల్లరుల సందర్భంలో పోలీసువారు 20 మందిని అరెస్టుచేసిరి.

రెండుగంటలైన తరువాత అంతా శాంతించింది.

పోలీసుకమిషనరు యీ అల్లరులు జరిగినచోట్ల రాత్రి 7-30 గంటలనుంచి ఉదయం 6 గంటలవరకు కర్ఫ్యూ ఉత్తరువును విధించిరి.

పైథోనీనుంచి ఒక ఊరేగింపు ప్రారంభించాలని ఒక పెద్దగుంపు చేరగా వారు వెళ్లిపోవలసిందిగా చెప్పిననుపోనందున పోలీసువారు లాఠీచార్జి చేసిరి. ముగ్గురికు గాయములు తగిలెను. ఇద్దరు స్త్రీలు వాలంటీర్లు, ఒక కాంగ్రెసువారు షేకుమెమను వీధిలోనుంచి యూనిఫారంలో కాంగ్రెసు పతాకతో వచ్చి, నినాదములు చేయగా పోలీసువారు అరెస్టుచేసిరి. ఇట్లాగే యింకో జట్టురాగా అరెస్టుచేసిరి. దీంతో జనానికి ఆవేశం పుట్టి ట్రాములమీద బస్సులమీద రాళ్లు రువ్వారంటారు. రాళ్లు రువ్వినందుకు ఆర్గురనుకాబోలు అరెస్టుచేసిరి. ఇప్పుడంతా శాంతంగా ఉంది.

రాష్ట్రమంతటా శాంతంగానే ఉన్నట్లు నేడు బొంబయి ఇన్స్పెక్టరు జనరలైరెక్టరు ప్రకటించిరి.

సాముదాయికపు జరిమానా

పూనాజిల్లాలో బారామతి పట్నంమీద 50 వేలు సాముదాయికపు జరిమానా విధింపబడినది. ఈ జరిమానాను షెడ్యూలు తరగతివారు, ప్రభుత్వోద్యోగులు, పోలీసువారికి దగ్ధాస్తులలో సహాయంచేసిన వారివద్దనుండి వసూలు చేయరు.

అహమ్మదాబాదులో అరెస్టులు

అహమ్మదాబాదు, సెప్టెం 6:— జిల్లామేజస్ట్రేటుగారొక ప్రకటన చేస్తూ స్వాతంత్ర్యదినం ఈరోజు జరుపుతామన్నప్పటికిని ఊరేగింపులేమీన్నీ జరుగలేదనియు, కర్ఫ్యూ ఉత్తరువు నుల్లంఘించినందుకు పదిమంది నరెస్టుచేసిరనిన్ని తెలుపుచున్నారు.

సంయుక్తరాష్ట్రంలో సాముదాయికపు జరిమానా

లక్నో, సెప్టెంబరు 6:— సం॥ రాష్ట్రముల గవర్నరుగారు 1942 కలెక్టివు ఫెన్సు ఆర్డినెన్సుక్రింద తమకుగల అధికారాన్ని బట్టి కాన్పూరుజిల్లాలో ఒక ఆరు గ్రామాలమీద 21 వేలున్ను, మరొకనిమిది గ్రామాలమీద ఆరు వేలున్ను, యింకో యేడు గ్రామాలమీద ఆరువేలున్ను, బలందషహరుజిల్లాలో కొన్ని గ్రామాలమీద పదివేలున్ను, పర్తబ్‌గరుజిల్లాలో కొన్నిగ్రామాలమీద పదివేలున్ను సాముదాయికపు జరిమానాను విధించిరి.

సం. రాష్ట్రప్రభుత్వంవారు ఒక ప్రకటన చేస్తూ రాష్ట్రంలోని వివిధమండలాలలో గతమూడువారాలలోనుఅల్లరులనణచటంలో సివిలుగార్డులేవిధంగా ప్రశంసనీయంగా పనిచేసారో తెలిపిరి.

గోరక్పూరు శిక్షలు

గోరక్పూరు, సెప్టెంబరు 6:— సం॥ రాం॥ జిల్లాలలో ప్రభుత్వ ఆస్తికి నష్టం కలుగజేయాల్సిందిగా గ్రామీణులను ప్రోత్సహించిన నేరానికిగాను విద్యావారధి రుద్రపైత్రేశాస్త్రి, నందగోపాలతివారి గారల కొక్కరికి రెండు సం॥లకఠిన శిక్షవిధింపబడెను. రాజకిశోరశర్మమరోముద్దయితనేరాన్ని ఒప్పుకొని, తన నెవరో తప్పుమార్గానికి దించినారని చెప్పుకోగా 250/- రూ. లకు స్వంత పూచీమీద వదలివేసిరి. (అ. ప్రె.)

విజయంకొరకు ప్రార్థనలు

మదరాసులో గవర్నరుగారి అధ్యక్షతను సభ

మదరాసు, సెప్టెంబరు 7:— జాతీయ యుద్ధరంగంవారు యేర్పాటుచేసిన ప్రార్థనాసభ నిన్న సాయంకాలం వి. పి. హాలులో గవర్నరుగారి అధ్యక్షతను జరిగెను. గవర్నరుగారి ఉపన్యాసముకాగానే యిరువురు కాంగ్రెసు వాలంటీరులు లోపలికివచ్చి వారి యెదురుగ యుద్ధ ప్రతికూల కేకలువేసి, కరపత్రములను విసరిరి. పోలీసువారు వారిని వెంటనే అరెస్టుచేసిరి. తరువాత సభ సాఫీగా జరిగిపోయింది.

హిందువుల తరఫున, మహమ్మదీయ క్రైస్తవ పార్సీ దివ్యజ్ఞాన సమాజముల తరఫున ప్రార్థనలు చదువబడెను. చీనాభాషలో యుకింగుమింగుగారు ప్రార్థనచేసిరి. ప్రతిప్రార్థన తరువాత పాటలుపాడిరి. సభామందిరమునిండుగ జనులువచ్చిరి. సభలో వేరొక మూలనుండి కేకలు వేసినవారుగూడ యిరువురు అరెస్టుచేయబడిరి. వెలుపల పోలీసు బందోబస్తు జాస్తిగా నుండెను.

గవర్నరుగారు సభను ప్రారంభించుచు, కెంటుప్రభువు మరణించినందుకు రాజుగారికి విచారం తెల్పుచు తీర్మానింపగోరగ సభవారంతా లేచినిలచిరి. తీర్మాన మంగీకరించబడెను.

తరువాత నేడు యుద్ధం మూడవ వార్షికదినం జరుపదలచితిమిగాన, యీ సభలో తమ కష్టాలన్ని గట్టెక్కించ దైవమును కోరుచు యిదివరకు చేసిన సహాయమునకు కృతజ్ఞత తెల్పుచు వివిధ మతముల తరఫున ప్రార్థనలు జరుప సమావేశమయితిమనిరి. ఈ సభానంతరం యీ నగరంలో వివిధమతముల సఖ్యత చేకూర్చే అవకాశం ఒకనాడు చిక్కింది కదా యని సంతోషంతో అందరం యిళ్లకు పోగలమనియు, యీసఖ్యత యుద్ధసమయంలోనేగాక శాంతి సమయంలో గూడ నుండగలదనియు, గవర్నరుగారు తెలిపిరి.

రాకపోకలు

మదరాసు, సెప్టెంబరు 7:— ఎం. పెద్. రామరెడ్డిగారు, కోయంబత్తూరునకు నిన్నరాత్రి, రా. బ. ఎం. రామనుగారు సికిందరాబాదునకు, విజయనగరంరాజాగారు లాహోరునకు నిన్న ఉదయం వెడలిపోయిరి.

ఉద్యోగుల మార్పులు

ఎం. రామచందరుగారు, కృష్ణజిల్లా జడ్జిగ చంగల్పటునుండి మార్చబడిరి.

కే. ఎన్. కుమారస్వామయ్యరు సబుజడ్జిగ నియమింపబడిరి.

న్యా॥ హోవ్‌లుగారు సెప్టెంబరు 15వ తేదినుండి అక్టోబరు 8 వ తేదీ వరకు శలవొసంగబడిరి.

మదరాసు వార్తలు

మలాంగు అహమ్మదు బాషాగారు కార్యాలేఖను సభ్యత్వమునకు రాజీనామా నిచ్చిరి.

సిపాయిల బిడ్డలకు సోదరులకు అక్కచెల్లెండ్రకు యిచ్చుచున్న సౌకర్యములు సిపాయిలభార్యలకు కూడ ఒసంగబడునని ప్రభుత్వంవారు ప్రకటించిరి.

మదరాసులో అరెస్టులు

మదరాసు, సెప్టెంబరు 7:— టి. పి. బాలకృష్ణను, ఎన్. తిరువెంకడం, కన్నయ్య, మధురయి, మణ్మగం అను కాంగ్రెసు ప్రచారకులను పోలీసువారు నిన్న మొన్న అరెస్టుచేసిరి.

కార్యాలేఖను సంఘసభ్యులగు టి. జి. లక్ష్మణస్వామి పిళ్లగారియిల్లు పోలీసువారు నిన్న ఉదయం చిందాద్రిపేటలో సోదాచేసిరి. కాని ఏమియు దొరకలేదు.

అధ్యక్షులగు కె. భాష్యం, కార్యవర్గ సభ్యులగు బి. జగన్నాథదాసు కె. శేషగోపంగార్లు అరెస్టు అయినందుకు మదరాసు మహాజనసభ నిన్న మూసివేయబడినది.

అమెరికాలో ఈ. రంగనాథన్ గారి ఉపన్యాసములు

న్యూయార్కు, సెప్టెంబరు 6:— ఇండియామంత్రి ముగ్గురు సలహాదారులలో నొక్కడగు సాయ్యుల్ ఈ. రంగనాథన్ గారు నాల్గు నెలలపాటు ఈ దేశములో నపన్యసించుటకై శనివారమునాడు రాత్రి బ్రిటెనునుండి భార్యాసమేతముగా విమానములో యిచ్చటికి వచ్చిరి. తాను నిష్పాక్షికముగా స్థితిగతులు తెలుపుననియు, తన ఉపన్యాసముల వల్ల అమెరికావారు నిజస్థితులు తెలిసికొను అవకాశము కలుగుననియు శ్రీ రంగనాథంగారు చెప్పిరి.

అన్ని వేళల సిద్ధము
జాంబక్-చర్మవ్యాధులకు
చర్మవ్యాధులను నిర్మూలించడానికి యీ విమర్శివారక మూలిక ఉత్తమమైనది. నొప్పి, మంటతగ్గించి గారడీవలె గాయములు మున్నగు వానిని కుదుర్చును. ప్రతిచోటా డాక్టర్లు నర్సులు జాంబక్‌ను విరివిగా వాడుతారు. వాడమని సలహా నిస్తారు. కోతలకు, గీసుకొని పోయినవాటికి, నేడే జాంబక్ డబ్బా ఒకటి కొనండి. వెల రు. 1/- లేక రు. 2/4/- సబ్బు రు. 1/- పౌడరు రు. 1/-
ఏజంట్లు: దాదా అండ్ కో., పి. టి. మదరాసు.
ఎల్లప్పుడు జాంబక్‌నే వాడుడు.
ZAM-BUK
ఇందు జంతువులగ్రొవ్వు లేదు.

రీటా
తలవెంట్రుకలను పెంచును
రీటా పురుగులకు బలమునిచ్చి, నిగనిగలాడు నిడుపాటి వెంట్రుకలను పెంచుటకు అద్భుతమైన హెయిర్ టానిక్.
తలవెంట్రుకలు రాలుట, నెరయుట, చుండ్రు, బట్టతల, పేనుకొరకు, ఇంకను తలవెంట్రుకలకు సంబంధించిన సమస్త వ్యాధులకు రీటా అమోఘముగ పనిచేయును. వేనకువేలు వాడి గుణమును పొందియున్నారు. మీరుకూడ నేటినుండియే రీటా వాడుడు.
రీటా ప్రతిచోట దొరకును. వెల సీసా 12 అణాలు.
కృష్ణవేణి:
రీటా చక్కని సువాసనకలిగి, మనస్సునకు ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. తలవెంట్రుకలను రాలకుండజేసి, కొత్త వెంట్రుకలను పెంచుటకు రీటా సాటిలేని హెయిర్ టానిక్ అని నిస్సందేహముగ చెప్పగలను.
రీటా
హెయిర్ టానిక్
RITA

స్త్రీల ఆరోగ్య సౌఖ్యములకు
Sadhana Aushadhalaya Dacca (Bengal)
Adalabandhab Jog
అబలాబంధబ్ జోగ
గర్భాశయము సరిగా పనిచేయునప్పుడే స్త్రీలు ఆరోగ్య సౌఖ్యము లనుభవింతురు. ఋతు సమయములోను, వంధ్యాత్వమునను, ల్యుకోరియ, ముట్టుకుట్టు సరిగా స్రావము కాకుండుట, గుండెదడ, వాంతి, తలనొప్పి, మొదలగు సమస్త గర్భాశయవ్యాధులకు అబలా-బంధబ్ జోగ అమోఘమైన ఆయుర్వేద చికిత్స. అది శీఘ్రముగా ముఖవికాసము, జీవశక్తి నొడగూర్చును.
అధ్యక్ష-డాక్టర్ జోగేశ్ చంద్రఘోష్, ఎం ఏ ఆయుర్వేదశాస్త్రి, ఎఫ్. సి. ఎస్. (లండన్) ఎం. సి. ఎస్. (అమెరికా), లోగడ భగల్పూర్ కాలేజీలో కెమిస్ట్రీ ప్రొఫెసరు.
అన్ని కేసులకు ఉచితముగా ఔషధమిగ్గ యింపబడును. కోరినవారికి కేటలాగుపంపబడును.
సాధనఔషధాలయ-ఢాకా.
పరిశుద్ధమైన అసలు ఆయుర్వేదౌషధములను తయారుచేయువారు.
ఇండియాలోను విదేశములలోను అంతట బ్రాంచీలు యేజన్సీలు కలవు.
17-ఏ, బ్రాడ్వే, మద్రాసు: లస్కార్ మహల్, వైనూరు.
ఆంధ్ర, దత్తమండలములు, వైజాగ్ డొమినియనులకు సోల్ యేజంట్లు:—
శ్రీనివాస మెడికల్ అండ్ ఫ్యాన్సీస్టోర్సు, రేపల్లె, (గుంటూరుజిల్లా).
ప్రతిచోట యేజంట్లు కావలెను. మరణులకు వ్రాసికొనుడు.

Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty Street Madras.